సింధూర దర్శిని
జాతీయ తెలుగు దినపత్రిక
ANNIVERSARY CELEBRATIONS 3rd ANNIVERSARY Day
శుభాకాంక్షలు

RNI : APTEL/2023/87662

# సింధూర దర్శిని

జాతీయ తెలుగు దినపత్రిక

ప్రతి అక్షరం అవినీతి పై సమరం

WWW.SINDHURADARSINI.COM WWW.EPAPER.SINDHURADARSINI.COM

**విలేకరులు కావలెను**

సింధూరదర్శిని జాతీయ తెలుగు దినపత్రికలో జిల్లాల వారీగా పనిచేయుటకు జిల్లా ఇన్చార్జీలు మరియు మండలాల వారీగా పనిచేయుటకు విలేకరులు కావలెను. ఎలాంటి వేతనం ఇవ్వబడదు. యాడ్స్ పై ఆకర్షణీయమైన కమిషన్ ఇవ్వబడును. అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడును. వివరాల కొరకు బయోడేటాతో క్రింది నంబర్‌ను సంప్రదించండి.

సెల్ నెంబర్ : 7 5 6 9 6 7 7 1 7 0

ప్రచురణ: తిరుపతి సంపుటి:3 సంచిక :296 సంపాదకులు: కలిచేటి వెంకయ్య మంగళవారం 22 సెప్టెంబర్ 2026 పేజీలు: 8 వెల:2

Circulated At :Tirupathi, Chittoor, Kadapa, SPSR Nellore, karnool, Prakasam, Hydrabad

# 45 గంటలు.. నాలుగు రాకెట్లు..



**30 ఉపగ్రహాలు.. అంతరిక్షం రంగంలో చైనా దూకుడు**

**మూడు వేర్వేరు ప్రయోగ కేంద్రాల నుంచి ప్రయోగాలు**

**ఉపగ్రహాలను విజయవంతంగా కక్ష్యలోకి చేర్చిన నాలుగు రాకెట్లు**

**రెండు రాకెట్లను అభివృద్ధి చేసిన ప్రైవేటు సంస్థలు**

**నాలుగు ప్రయోగాల్లో జరగని రాకెట్ దశల రికవరీ**

**సింధూరదర్శిని:** చైనా అంతరిక్ష రంగంలో దూకుడు పెంచుతోంది. కేవలం 45 గంటల వ్యవధిలో నాలుగు రాకెట్లను విజయవంతంగా ప్రయోగించింది. మూడు వేర్వేరు ప్రయోగ కేంద్రాల నుంచి ఈ ప్రయోగాలు జరిగాయి. సెప్టెంబర్ 15, 16 తేదీల్లో చేపట్టిన ఈ ప్రయోగాల్లో ప్రభుత్వ సంస్థలతో పాటు ప్రైవేటు కంపెనీల రాకెట్లు కూడా ఉన్నాయి. మొదటి ప్రయోగం సెప్టెంబర్ 15న జియుక్వాన్ ఉపగ్రహ ప్రయోగ కేంద్రం నుంచి జరిగింది. ల్యాండ్‌స్పేస్ సంస్థకు చెందిన జుక్యూ-2ఈ రాకెట్ 10 ఉపగ్రహాలను కక్ష్యలోకి చేర్చింది. క్వియాన్‌ఫాన్ బ్రాడ్‌బ్యాండ్ మెగా శాటిలైట్ నెట్‌వర్క్ కోసం వీటిని పంపారు. ఈ నెట్‌వర్క్‌లో భవిష్యత్తులో దాదాపు 15వేల ఉపగ్రహాలను ప్రవేశపెట్టాలని చైనా లక్ష్యంగా పెట్టుకుంది. అదే రోజు షాంఘై సముద్ర తీరంలోని మొబైల్ ప్లాట్‌ఫామ్ నుంచి ఒరియెన్‌స్పేస్ గ్రావిటీ-1 రాకెట్ నింగిలోకి దూసుకెళ్లింది. ఇది మరో తొమ్మిది క్వియాన్‌ఫాన్ ఉపగ్రహాలను కక్ష్యలోకి చేర్చింది. ఘన ఇంధనంతో పనిచేసే ఈరాకెట్ ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైన

మిగతా 2లో...



# కుప్పంలో రూ.45కోట్లతో రిజర్వాయర్

**ప్రకృతి సేద్యమే శ్రీరామరక్ష - ప్రతి ఇంటినీ ఆర్థికంగా బలోపేతం చేస్తాం**

**కుప్పం అభివృద్ధికి కొత్తఊపు తెస్తాం**

**కుప్పంలో రూ.327 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు సీఎం చంద్రబాబు భూమిపూజ, శంకుస్థాపనలు**

**నీరు.. పరిశ్రమలు.. ఉపాధి.. సౌర విద్యుత్.. స్వర్ణ కుప్పం దిశగా సీఎం ప్రణాళిక**

**కుప్పం సింధూరదర్శిని:**
నారావారిపల్లె తనకు జన్మనిస్తే... కుప్పం రాజకీయ జీవితాన్ని ఇచ్చిందని ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. కుప్పాన్ని మోడల్ నియోజకవర్గంగా, స్వర్ణ కుప్పంగా తీర్చిదిద్దేందుకు సమగ్ర ప్రణాళికతో ముందుకెళ్తున్నామని తెలిపారు. గడచిన రెండేళ్లలో రెట్టింపు ఉత్సాహంతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని, కుప్పం నుంచే ఏపని చేయాలన్నా నాంది పలుకుతామని చెప్పారు. కుప్పంలో సోమవారం వివిధ అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. రూ. 327కోట్ల విలువైన అభివృద్ధి కార్యక్రమాలకు సోమవారం

మిగతా 2లో...

# వైసీపీ నేతలది రౌడీయిజం..

**విజయవాడలో టీచర్లపై దాడి యత్నం దారుణం మంత్రి రాంప్రసాద్ రెడ్డి**

**టీచర్లపై దాడికి యత్నించడం హేయమైన చర్యగా అభివర్ణించిన మంత్రి**

**విజయవాడ శాప్ కార్యాలయం వద్ద వైసీపీ నేతలు దౌర్జన్యానికి పాల్పడ్డారని ఆరోపణ**

**జోగి రమేశ్, దేవినేని అవినాశ్ రాళ్లు, కోడిగుడ్లతో దాడి చేశారని విమర్శ**

**ఇలాంటి చర్యలను సహించేది లేదన్న రాంప్రసాద్ రెడ్డి**

**చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరిక**



**విజయవాడ సింధూరదర్శిని:**
విజయవాడలోని 'శాప్' కార్యాలయం వద్ద ఉపాధ్యాయులపై దాడికి యత్నించడం హేయమైన చర్య అని ఏపీ క్రీడలశాఖ మంత్రి రాంప్రసాద్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. వైసీపీ నేతలు జోగి రమేశ్, దేవినేని అవినాశ్ తదితరులు గుంపులుగా వచ్చి ప్రభుత్వ కార్యాలయంపై రాళ్లు, కోడిగుడ్లతో దాడి చేయడం దారుణమని అన్నారు. విజయవాడలో మీడియాతో మాట్లాడిన ఆయన, వైసీపీ నేతల తీరును తప్పుపట్టారు. డీఎస్సీ స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలు సాధించిన ఉపాధ్యాయులపై దాడికి యత్నించడం, ప్రభుత్వ కార్యాలయాన్ని చుట్టుముట్టడం అప్రజాస్వామికమని మంత్రి విమర్శించారు. కష్టపడి ఉద్యోగాలు సంపాదించుకున్న క్రీడాకారులను, ఉపాధ్యాయులను

మిగతా 2లో...

# టీచర్లపై దాడి నిందితులను వదిలిపెట్టం

**స్పోర్ట్స్ కోటా టీచర్లపై దాడికి దిగారంటూ లోకేశ్ ఆగ్రహం**

**దైవం వంటి గురువులపై దాడి చేసిన వారిపై కఠిన చర్యలుంటాయని హెచ్చరిక**

**దేశానికి వన్నె తెచ్చిన క్రీడాకారులను జగన్ అవమానిస్తున్నారని ఆరోపణ**

**రౌడీ షీటర్లు, గంజాయి, బ్లేడ్ బ్యాచ్‌లను టీచర్లపైకి ఉసిగొల్పారని విమర్శ**

**ప్రభుత్వ పాఠశాలలు, టీచర్ల జోలికి రావొద్దని హితవు**





**అమరావతి సింధూరదర్శిని:**
విజయవాడలో స్పోర్ట్స్ కోటా డీఎస్సీ-2025 టీచర్లపై దాడికి వైసీపీ మూకలు దాడికి దిగాయంటూ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. వైసీపీపై తీవ్ర ఆరోపణలు చేస్తూ 'ఎక్స్'లో పోస్టు చేశారు. క్రీడాకారులుగా దేశానికి పేరు తీసుకొచ్చిన వారికి అన్యాయం చేయడం సరికాదని అన్నారు. దైవంలా భావించే టీచర్లపై దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. స్పోర్ట్స్ కోటాలో అవకతవకలు జరిగాయంటూ ఫేక్ ఆరోపణలు చేసినప్పుడే జగన్ దుర్బుద్ధి బయటపడిందని లోకేశ్ విమర్శించారు. క్రీడల్లో

మిగతా 2లో...



**సూర్యప్రభ వాహనంపై శ్రీ మలయప్పస్వామి దివ్య వైభవం**

వివరాలు 2 లో



**వైసీపీకి రాజీనామా చేసిన మాజీ ఎమ్మెల్యే వరుపుల సుబ్బారావు**

వివరాలు 2 లో

# ఏపీలో జూడాలకు గుడ్‌న్యూస్ చెప్పిన కూటమి ప్రభుత్వం

**ఏపీలో జూనియర్ డాక్టర్లు, హౌస్ సర్జన్ల స్టైఫండ్ పెంపు**

**ఎంబీబీఎస్, బీడీఎస్ ఇంటర్న్‌లకు 10 శాతం పెరుగుదల**

**పీజీ విద్యార్థులకు 5%, సూపర్ స్పెషాలిటీ వారికి 3.5% పెంపు**

**2026 జనవరి 1 నుంచే పెంపు వర్తిస్తుందని ఉత్తర్వుల్లో వెల్లడి**



**అమరావతి సింధూరదర్శిని:**
ఆంధ్రప్రదేశ్‌లోని ప్రభుత్వ వైద్య కళాశాలల్లో పనిచేస్తున్న జూనియర్ డాక్టర్లు, హౌస్ సర్జన్లకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. వారి స్టైఫండ్‌ను పెంచుతూ సోమవారం అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది. పెంచిన స్టైఫండ్ 2026 జనవరి 1వ తేదీ నుంచి వర్తిస్తుందని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ నిర్ణయంతో ప్రభుత్వ ఖజానాపై ఏటా రూ.34.08 కోట్ల అదనపు భారం పడనుంది. వివరాల్లోకి వెళితే, తమ పనిభారానికి తగినట్లుగా స్టైఫండ్ పెంచాలని జూనియర్ డాక్టర్ల

మిగతా 2లో...

# గురువుల కష్టార్జితంపై 'ఫేక్' ముద్ర వేయడం సరికాదు

**మెగా డీఎస్సీ నియామకాలపై ప్రతి ఆరోపణకూ ఆధారాలతో సమాధానం ఇస్తాం: మంత్రి వాసంశెట్టి సుభాష్**



**అమరావతి సింధూరదర్శిని:**
కష్టపడి చదివి, క్రీడల్లో ప్రతిభ చాటి, నిబంధనల ప్రకారం మెగా డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ ఉద్యోగాలు పొందిన వారిని 'ఫేక్' అంటూ అవమానించడం సరికాదని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. రాజకీయ ప్రయోజనాల కోసం వేలాది మంది ఉపాధ్యాయుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీయడం తగదని పేర్కొన్నారు. విజయవాడలోని శాప్ కార్యాలయం వద్ద సోమవారం చోటుచేసుకున్న పరిణామాలపై మంత్రి స్పందిస్తూ.. ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే హక్కు ప్రతి ఒక్కరికీ ఉందని, ప్రభుత్వ నిర్ణయాలపై అభ్యంతరాలుంటే చట్టబద్ధ మార్గాల్లో నిరసన తెలియజేయవచ్చని అన్నారు. అయితే నిరసనలు భౌతిక ఘర్షణలకు దారితీయకూడదని స్పష్టం చేశారు. ఘటనలో ఎవరైనా చట్టాన్ని ఉల్లంఘించి ఉంటే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు.

**మెగా డీఎస్సీ.. పారదర్శక నియామక ప్రక్రియ**

మెగా డీఎస్సీ నియామక ప్రక్రియలో నోటిఫికేషన్ నుంచి పరీక్షలు, ఆన్సర్ కీలు, మెరిట్ జాబితాలు, అభ్యంతరాల స్వీకరణ, సర్టిఫికెట్ వెరిఫికేషన్, తుది ఎంపిక వరకు నిర్దేశిత విధానాలను అనుసరించినట్లు మంత్రి తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం ఉపాధ్యాయ నియామకాలకు అత్యంత ప్రాధాన్యం ఇచ్చిందని, మెగా డీఎస్సీ ద్వారా 16,347 ఉపాధ్యాయ పోస్టుల భర్తీ

మిగతా 2లో...

# బంగాళాఖాతంలో అల్పపీడనం ప్రభుత్వ యంత్రాంగాన్ని అలెర్ట్ చేసిన హోంమంత్రి అనిత

**బుధ, గురువారాల్లో భారీ వర్షాల నేపథ్యంలో అధికారులకు ఆదేశాలు**

**వంశధార, నాగావళి నదుల ప్రవాహాలపై ప్రత్యేక దృష్టి సారించాలి**

**వాగులు, కాజ్‌వేల వద్ద ప్రత్యేక నిఘా**

**ఎస్‌డిఆర్‌ఎఫ్, ఎన్‌డిఆర్ఓఎఫ్‌సి బృందాలు సిద్ధంగా ఉంచాలి**

**ప్రజలు ప్రభుత్వం జారీ చేసే అధికారిక సూచనలను పాటించాలి : హోంమంత్రి అనిత**



**అమరావతి సింధూరదర్శిని:**
బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం రాబోయే రెండు రోజుల్లో తీవ్రవాయు గుండంగా బలపడి దక్షిణ ఒడిశా - ఉత్తరాంధ్ర తీరాల వైపు పయనించే అవకాశం ఉందన్న హెచ్చరికల నేపథ్యంలో రాష్ట్ర హోం, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి వంగలపూడి అనిత ఉన్నత స్థాయి అత్యవసర సమీక్ష నిర్వహించారు. ప్రభావిత జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్, ఇతర ఉన్నతాధికారులతో అత్యవసర టెలికాన్ఫరెన్స్ నిర్వహించి, క్షేత్రస్థాయిలో తీసుకోవాల్సిన ముందస్తు భద్రతా చర్యలపై దిశానిర్దేశం చేశారు.
తీవ్రవాయుగుండం ప్రభావంతో బుధ, గురువారాల్లో ఉత్తరాంధ్రలో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హోంమంత్రి తెలిపారు. ఒడిశాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున వంశధార, నాగావళి నదుల ప్రవాహాలపై ప్రత్యేక దృష్టి సారించాలని హోంమంత్రి సూచించారు. ఒడిశా సరిహద్దు జిల్లాల అధికారులతో సమన్వయం

మిగతా 2లో...

## 45 గంటలు.. నాలుగు రాకెట్లు..

**(మొదటిపేజీ తరువాయి)**

సాలిడ్ ఫ్యూయల్ రాకెట్‌గా గుర్తింపు పొందింది. మూడో ప్రయోగం హైనాన్ దీవిలోని వెన్‌చాంగ్ కేంద్రం నుంచి జరిగింది. ప్రభుత్వ రంగానికి చెందిన లాంగ్ మార్చ్-12 రాకెట్ తొమ్మిది ఉపగ్రహాలను కక్ష్యలోకి పంపింది. ఇవి సాట్‌నెట్ పేరుతో ఏర్పాటు చేస్తున్న మరో భారీ బ్రాడ్‌బ్యాండ్ నెట్‌వర్క్ కోసం ఉద్దేశించినవి. ఇందులో దాదాపు 13 వేల ఉపగ్రహాలను ప్రవేశపెట్టే ప్రణాళిక ఉంది. నాలుగో ప్రయోగంతో ఈ వరుస ముగిసింది. జియుక్వాన్ నుంచి కుయ్‌జౌ-11 రాకెట్ రెండు రాడార్ భూ పరిశీలన ఉపగ్రహాలను కక్ష్యలోకి చేర్చింది. మొత్తంగా నాలుగు ప్రయోగాల్లో 30 ఉపగ్రహాలను చైనా కక్ష్యలోకి పంపింది. ఈ నాలుగు ప్రయోగాలు చైనా అంతరిక్ష రంగంలో ప్రైవేటు సంస్థల పాత్ర పెరుగుతున్న విషయాన్ని కూడా చూపించాయి. అయితే ఈ నాలుగు ప్రయోగాల్లో ఏ రాకెట్ బూస్టర్‌ను తిరిగి భూమికి తీసుకురాలేదు. కాగా, జుక్యూ-3, లాంగ్ మార్చ్-10బీ రాకెట్ల తొలి దశలను విజయవంతంగా ల్యాండ్ చేసి పునర్వినియోగ సాంకేతికతలో చైనా ముందడుగు వేసింది.

## టీచర్లపై దాడి నిందితులను వదిలిపెట్టం..

**(మొదటిపేజీ తరువాయి)**

ప్రతిభ చూపించి టీచర్ ఉద్యోగాలు సాధించిన వారిని వైసీపీ అవమానిస్తోందని ఆరోపించారు. తమకు న్యాయం చేయాలంటూ స్పోర్ట్స్ కోటా డీఎస్సీ-2025 టీచర్లు విజయవాడ శాప్ కార్యాలయం వద్ద అధికారులను కలిశారని లోకేశ్ తెలిపారు. ఈ సమయంలో వైసీపీకి చెందిన కొందరు వ్యక్తులు టీచర్లపై దాడికి దిగారని ఆరోపించారు. రౌడీ షీటర్లు, గంజాయి, బ్లేడ్ బ్యాచ్‌లను టీచర్లపైకి ఉసిగొల్పారని లోకేశ్ ఆరోపించారు. గురువులపై రాడ్లు, కర్రలతో దాడి చేయడం దారుణమని అన్నారు. టీచర్లపై దాడి చేసిన వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని లోకేశ్ స్పష్టం చేశారు. వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలు, టీచర్ల జోలికి వైసీపీ రావడం మానుకోవాలని సూచించారు.

## వైసీపీ నేతలది రౌడీయిజం..

**(మొదటిపేజీ తరువాయి)**

అవమానించడం సరికాదన్నారు. సమస్యలుంటే శాంతియుతంగా పరిష్కరించుకోవాలి గానీ, ఇలా ఉద్రిక్తతలు సృష్టించడం తగదని హితవు పలికారు. ఇలాంటి చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని, బాధ్యులైన వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని రాంప్రసాద్ రెడ్డి హెచ్చరించారు. ఉపాధ్యాయుల ఆత్మగౌరవం విషయంలో వైసీపీ నేతలు ఎలా ప్రవర్తించారనేది ఆ పార్టీకే వదిలేస్తున్నామని వ్యాఖ్యానించారు. కాగా, శాప్ కార్యాలయం వద్ద మెగా డీఎస్సీ స్పోర్ట్స్ కోటా ఉపాధ్యాయులు, వైసీపీ నేతల మధ్య నినాదాలతో ఉద్రిక్తత వాతావరణం నెలకొంది.

## ఏపీలో జూడాలకు గుడ్‌న్యూస్ చెప్పిన కూటమి ప్రభుత్వం

**(మొదటిపేజీ తరువాయి)**

అసోసియేషన్ (జూడా) కొంతకాలంగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ ఆందోళనలు చేపట్టింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం వారి డిమాండ్లను పరిగణనలోకి తీసుకుని స్టైఫండ్ పెంపునకు ఆమోదం తెలిపింది. ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం, ఎంబీబీఎస్, బీడీఎస్ హౌస్ సర్జన్లకు 10 శాతం స్టైఫండ్ పెంచారు. దీంతో వారి నెలవారీ స్టైఫండ్ రూ.28,497కి చేరింది. అదేవిధంగా, పీజీ డిగ్రీ, డిప్లొమా కోర్సులు చేస్తున్న వైద్య విద్యార్థులకు 5 శాతం, సూపర్ స్పెషాలిటీ కోర్సులు అభ్యసిస్తున్న వారికి 3.5 శాతం చొప్పున స్టైఫండ్‌ను పెంచారు. ఈ పెంపు నిర్ణయం ఎంబీబీఎస్, బీడీఎస్, పీజీ మెడిసిన్, సూపర్ స్పెషాలిటీ, ఎండీఎస్, డీఎన్‌బీ విద్యార్థులందరికీ వర్తిస్తుంది. జూనియర్ డాక్టర్ల ఆందోళనల నేపథ్యంలో ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం పట్ల వైద్య విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## వైసీపీకి రాజీనామా చేసిన మాజీ ఎమ్మెల్యే వరుపుల సుబ్బారావు

**జనసేన కండువా కప్పిన పవన్**

**నియోజకవర్గాల నుంచి భారీగా జనసేనలోకి వైసీపీ నేతలు**

కాకినాడ, సింధూరదర్శిని: జిల్లాలో అధికార వైసీపీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ప్రత్తిపాడు నియోజకవర్గానికి చెందిన సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే వరుపుల సుబ్బారావు జనసేన పార్టీలో చేరారు. సోమవారం సాయంత్రం పిఠాపురంలో ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఆయనకు పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీ బలోపేతం కోసం క్షేత్రస్థాయిలో కృషి చేయాలని పవన్ వారికి సూచించారు. ఈ సందర్భంగా వరుపుల సుబ్బారావు మాట్లాడుతూ, గత వైసీపీ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. జగన్ పాలనలో ఇళ్ల స్థలాల పేరుతో భారీగా కమీషన్లు దండుకున్నారని ఆరోపించారు. ముఖ్యంగా ప్రత్తిపాడు నియోజకవర్గంలో ఏమాత్రం పనికిరాని భూములను అధిక ధరలకు కొనుగోలు చేసి లబ్ధిదారులకు కేటాయించారని, ఆ స్థలాలు ఇప్పటికీ నిరుపయోగంగానే ఉన్నాయని విమర్శించారు. పార్టీలో తనలాంటి సీనియర్లకు సరైన గౌరవం దక్కలేదని, గతంలో తన వయసును ఉద్దేశించి కూడా జగన్ మాట్లాడారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వ విధానాలు, ముఖ్యంగా పవన్ కళ్యాణ్ నాయకత్వం నచ్చి ఎలాంటి పదవులు, హామీలు ఆశించకుండా జనసేనలో చేరుతున్నట్లు స్పష్టం చేశారు.

# గురువుల కష్టార్జితంపై 'ఫేక్' ముద్ర వేయడం సరికాదు

**(మొదటిపేజీ తరువాయి)**

ప్రక్రియను 148 రోజుల్లో పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. ఈ నియామకాలు వేలాది కుటుంబాల్లో కొత్త ఆశలు, ఆర్థిక భరోసాను కల్పించాయని అన్నారు. నియామక ప్రక్రియపై ఎవరికైనా నిర్దిష్ట అభ్యంతరాలు ఉంటే సంబంధిత ఆధారాలను అధికారుల ముందుంచాలని సూచించారు. ప్రతి అభ్యర్థి అర్హతను నిబంధనలు, అధికారిక రికార్డుల ఆధారంగా పరిశీలించే వ్యవస్థ ఉందని, తప్పు తేలితే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకునే అవకాశం ఎప్పుడూ ఉంటుందని తెలిపారు.

**స్పోర్ట్స్ కోటా అభ్యర్థుల గౌరవాన్ని దెబ్బతీయొద్దు**

స్పోర్ట్స్ కోటా నియామకాలపై వస్తున్న ఆరోపణలను ప్రస్తావిస్తూ.. నిర్దిష్ట ధ్రువపత్రాలపై అనుమానాలుంటే వాటిని అధికారికంగా పరిశీలించవచ్చని మంత్రి అన్నారు. అయితే ఆధారాలు లేకుండా మొత్తం స్పోర్ట్స్ కోటా ద్వారా ఎంపికైన అభ్యర్థులందరినీ 'ఫేక్'గా చిత్రీకరించడం సమంజసం కాదని స్పష్టం చేశారు. సంబంధిత అధికారులు కూడా స్పోర్ట్స్ సర్టిఫికెట్లు, టెట్ అర్హత, ఇతర ధ్రువపత్రాలను అధికారిక రికార్డుల ఆధారంగా వ్యక్తిగతంగా పరిశీలిస్తున్నారని తెలిపారు. క్రీడల్లో ప్రతిభ కనబరిచి, ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఉద్యోగం సాధించిన ఉపాధ్యాయుల గౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. ఒక నిర్దిష్ట అంశంపై అనుమానం ఉంటే దానిని పరిశీలించాలి కానీ, దాని ఆధారంగా మొత్తం నియామక ప్రక్రియను అనుమానాస్పదంగా చిత్రీకరించడం సరికాదని అన్నారు.

**విజయవాడ ఘటనపై చట్టప్రకారం చర్యలు**

శాప్ కార్యాలయం వద్ద చోటుచేసుకున్న ఉద్రిక్తతలపై మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయంగా విభేదాలు, వాదోపవాదాలు సహజమే అయినా అవి శాంతియుతంగా, ప్రజాస్వామ్య పద్ధతిలో జరగాలని అన్నారు. "మేము చదువుకున్నాం.. కష్టపడ్డాం.. నిబంధనల ప్రకారం ఉద్యోగాలు సాధించాం.. మా ఉద్యోగం మా కష్టార్జితం" అని ఉపాధ్యాయులు చెబుతున్నప్పుడు వారి వాదనను కూడా వినాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. ఉపాధ్యాయులు సమాజానికి విద్యాబుద్ధులు నేర్పే వారని, వారే రాజకీయ ఘర్షణల్లో బాధితులుగా మారే పరిస్థితి రావడం బాధాకరమని మంత్రి పేర్కొన్నారు. ఘటనకు సంబంధించి వాస్తవాలను పరిశీలించి, చట్టాన్ని ఉల్లంఘించిన వారిపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

**గ్రూప్-1 వ్యవహారంపై వాస్తవాలు వెలుగులోకి రావాలి**

గత ప్రభుత్వ హయాంలో జరిగిన గ్రూప్-1 మెయిన్స్ పరీక్ష మూల్యాంకన ప్రక్రియపై సమర్పించిన నివేదికలో పలు విధానపరమైన లోపాలు, దిద్దుబాట్లు, సంతకాలలో వ్యత్యాసాలు వంటి అంశాలు నమోదైనట్లు మంత్రి పేర్కొన్నారు. SIT పరిశీలించిన 736 రికార్డుల్లో 718 రికార్డుల్లో మార్పులు లేదా ఓవర్‌రైటింగ్ ఉన్నట్లు పలు నివేదికలు పేర్కొన్నాయి. అదే సమయంలో, ఎంపికైన అభ్యర్థుల అసలు జవాబు పత్రాలు మార్చబడినట్లు లేదా తారుమారు చేసినట్లు SIT నిర్ధారించలేదని తాజా కోర్టు నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. అందువల్ల ఈ అంశంపై వాస్తవాలను కోర్టు పరిధిలోనే తేల్చాల్సి ఉందని మంత్రి అన్నారు. నియామక పరీక్షల విషయంలో పారదర్శకత అత్యంత కీలకమని, నిరుద్యోగ యువత భవిష్యత్తుతో ముడిపడి ఉన్న ప్రతి నియామక ప్రక్రియలో నిబంధనలు కచ్చితంగా పాటించాల్సిందేనని వాసంశెట్టి సుభాష్ అన్నారు. "ఉపాధ్యాయుల కష్టాన్ని రాజకీయ వివాదంగా మార్చొద్దు. ఆరోపణలు ఉంటే ఆధారాలు చూపాలి.. విచారణ కోరాలి.. చట్టబద్ధమైన మార్గాల్లో ముందుకు వెళ్లాలి. కానీ కష్టపడి ఉద్యోగం సాధించిన వారి గౌరవాన్ని దెబ్బతీయడం మాత్రం సమర్థనీయం కాదు" అని మంత్రి స్పష్టం చేశారు.

# కుప్పంలో రూ.45కోట్లతో రిజర్వాయర్

**(మొదటిపేజీ తరువాయి)**

భూమిపూజ, శంకుస్థాపనలు చేశారు. అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో మాట్లాడారు. హంద్రీనీవా కాలువ ద్వారా కుప్పానికి నీటిని తీసుకువచ్చి 133 చెరువులను నింపగలిగామని ముఖ్యమంత్రి తెలిపారు. కుప్పం నియోజకవర్గంలోని 550కుపైగా చిన్న నీటిపారుదల చెరువులను లిఫ్ట్ ఇరిగేషన్, పైప్‌లైన్లతో అనుసంధానం చేయనున్నట్లు చెప్పారు. యామిగానిపల్లి, మనపల్లి ప్రాంతాల్లో రిజర్వాయర్లు ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలిస్తున్నామని వెల్లడించారు. బీరువానిపల్లి వద్ద హంద్రీనీవా సుజల స్రవంతి కుప్పం బ్రాంచ్ కెనాల్ ద్వారా రూ.45 కోట్లతో రిజర్వాయర్ నిర్మించనున్నట్లు తెలిపారు. ఈ ఏడాది రిజర్వాయర్లలో నీటి నిల్వలు తక్కువగా ఉన్నందున అందుబాటులో ఉన్న నీటిని పొదుపుగా, సద్వినియోగం చేసుకోవాలని సీఎం సూచించారు. పశుదాణాకు ఇబ్బంది లేకుండా కూడా కార్యాచరణ చేపట్టామని తెలిపారు. ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయని సీఎం తెలిపారు. కృష్ణా, గోదావరి నదులకు ఆశించిన స్థాయిలో నీరు రాకపోవడంతో నీటి లభ్యతపై ఒత్తిడి ఏర్పడిందన్నారు. ఈ నేపథ్యంలో రైతులు అధికంగా రసాయన ఎరువులు వినియోగించకుండా ప్రకృతి సేద్యం, ప్రత్యామ్నాయ పంటలు, సూక్ష్మ సాగునీటి విధానాలపై దృష్టి పెట్టాలని సూచించారు. ప్రకృతి సేద్యమే శ్రీరామరక్ష అనే విధానంతో ముందుకెళ్లాలని పిలుపునిచ్చారు. సేంద్రీయ ఎరువుల వినియోగం, బయోచార్ వంటి విధానాలతో భూమిలో సారం, తేమ పెంచడంతో పాటు జీవవైవిధ్యాన్ని పరిరక్షించాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రంలో ఇప్పటికే 20 లక్షల మంది ప్రకృతి సేద్యం చేస్తున్నారని, ఈ సంఖ్యను మరింత పెంచాలని చెప్పారు. పీఎండీఎస్ విధానం ద్వారా ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించాలని, భూములను ఖాళీగా ఉంచకుండా సాగులోకి తీసుకురావాలని సూచించారు. తక్కువ నీటితో సాగయ్యే చిరుధాన్యాలతో పాటు పశుపోషణ, పౌల్ట్రీ, ఉద్యాన పంటలపై దృష్టి పెడితే రైతులు, మహిళలకు అదనపు ఆదాయం లభిస్తుందని తెలిపారు.

**ప్రతి ఇంటిపైనా సోలార్ రూఫ్‌టాప్**

కుప్పాన్ని నెట్‌జీరో నియోజకవర్గంగా తీర్చిదిద్దుతామని ముఖ్యమంత్రి ప్రకటించారు. ఆస్పత్రులు, కళాశాలలు, పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు సహా అన్ని భవనాలు నెట్‌జీరో దిశగా ఉండాలని ఆకాంక్షించారు. ప్రతి ఇంటిపైనా సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటు చేసి.. ప్రతి ఇల్లూ విద్యుత్ ఉత్పత్తి కేంద్రంగా మారేలా చర్యలు చేపడతామని చెప్పారు. వ్యవసాయ ఫీడర్ల కోసం 15 మెగావాట్ల సామర్థ్యంతో ఏర్పాటు చేసిన పీఎం-కుసుమ్ సోలార్ ప్రాజెక్టులను ముఖ్యమంత్రి ప్రారంభించారు. కుప్పంలో 8,904 బంగారు కుటుంబాలను గుర్తించి పీ4 కార్యక్రమం ద్వారా ఆర్థికంగా బలోపేతం చేస్తున్నామని సీఎం తెలిపారు. కుప్పాన్ని పేదరికం లేని నియోజక వర్గంగా మార్చడమే లక్ష్యమన్నారు. టీవీఎస్, అదానీ, మెగా తదితర సంస్థలు 8,900కుపైగా కుటుంబాలను దత్తత తీసుకుని వాటి ఆర్థికాభివృద్ధికి తోడ్పడుతున్నాయని తెలిపారు. ప్రతి ఇంటి నుంచి ఒక పారిశ్రామికవేత్త, ఒక స్టార్టప్ వ్యవస్థాపకుడు తయారవ్వాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. కుప్పంలో ఇప్పటికే 32 పరిశ్రమలు ఏర్పాటయ్యాయని, వాటి ద్వారా స్థానిక యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయని తెలిపారు. స్థానిక పరిశ్రమల్లో స్థానిక యువతకే ఉద్యోగాలు లభించేలా నైపుణ్య శిక్షణ అందిస్తున్నామని చెప్పారు. బిర్లా ఇన్‌స్టిట్యూట్‌తో పాటు మానస సరోవర్ గ్లోబల్ యూనివర్సిటీ ద్వారా కూడా నైపుణ్య శిక్షణ అందిస్తామని తెలిపారు.

**కుప్పం అభివృద్ధికి భారీ ప్రణాళిక**

రెండు నెలల క్రితం కుప్పంలో రూ.7,939కోట్ల విలువైన ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశామని సీఎం గుర్తుచేశారు. తాజాగా కుప్పం మున్సిపాలిటీ పరిధిలో రూ.38 కోట్ల విలువైన ప్రభుత్వ పనులకు శంకుస్థాపన చేశామని తెలిపారు. మరో రూ.289 కోట్ల విలువైన ప్రాజెక్టులకు కూడా భూమిపూజ నిర్వహించినట్లు చెప్పారు. కుప్పంలో ఎక్కడా చెత్త కనిపించకుండా పారిశుధ్యాన్ని మెరుగుపరచడమే లక్ష్యమని సీఎం తెలిపారు. 82 ప్రాసెసింగ్ కేంద్రాల ద్వారా చెత్త నుంచి కంపోస్టు తయారు చేస్తున్నామని చెప్పారు. రూ.3.30 కోట్లతో నిర్మించిన సమగ్ర ఘన వ్యర్థాల నిర్వహణ ప్లాంట్, మెటీరియల్ రికవరీ సెంటర్‌ను ప్రారంభించారు. రూ.10 కోట్ల వ్యయంతో నిర్మించనున్న ఆర్డీఓ, ఏఎస్పీ కార్యాలయాలకు శంకుస్థాపన చేశారు. పది ఎకరాల విస్తీర్ణంలో రూ.2.70కోట్లతో చేపట్టనున్న మల్లనూరు జూనియర్ కళాశాల పనులకు భూమిపూజ చేశారు. కుప్పం మార్కెట్ యార్డులో రూ.2.50కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. కుప్పం మున్సిపాలిటీ పరిధిలో హైమాస్ట్ వీధి దీపాలు, పబ్లిక్ టాయిలెట్లు, అండర్‌గ్రౌండ్ యుటిలిటీ వ్యవస్థ, బీటీ, సీసీ రోడ్లు తదితర మౌలిక వసతులను అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. స్థానిక ఉత్పత్తుల విక్రయానికి ఆధునిక రైతు బజార్ ఏర్పాటు చేస్తామని చెప్పారు. హెరిటేజ్ గ్రానైట్ స్టోన్‌క్లస్టర్‌ను అభివృద్ధి చేయనున్నట్లు వెల్లడించారు.

**కుప్పం కనెక్టివిటీకి పెద్దపీట**

కుప్పం రైల్వే స్టేషన్‌లో దాదర్-పుదుచ్చేరి ఎక్స్‌ప్రెస్ రైలు నిలిచేలా కేంద్ర ప్రభుత్వం మాట్లాడి ఆ సౌకర్యాన్ని కల్పించామని సీఎం తెలిపారు. బెంగళూరు, చెన్నై, కేజీఎఫ్, కృష్ణగిరి ప్రాంతాలను అనుసంధానించేలా జాతీయ రహదారుల అభివృద్ధి జరుగుతోందన్నారు. కుప్పం-పోగురుపల్లి నుంచి బెంగళూరుకు ప్రత్యామ్నాయ రహదారి నిర్మిస్తున్నామని చెప్పారు. చిత్తూరు నుంచి కుప్పానికి బ్రాడ్‌గేజ్ రైలు మార్గం కల్పించాలని రైల్వే శాఖ మంత్రిని కోరినట్లు తెలిపారు. కుప్పంలో ఉత్పత్తయ్యే వస్తువులు కృష్ణపట్నం పోర్టుకు చేరేలా కనెక్టివిటీని మరింత పెంచుతున్నామని చెప్పారు. భవిష్యత్తులో కుప్పంలో విమానాశ్రయం ఏర్పాటు చేసే దిశగా కూడా చర్యలు చేపడతామని తెలిపారు. సంజీవని ప్రాజెక్టు ద్వారా పౌరుల ఆరోగ్య రికార్డులను డిజిటలైజ్ చేస్తున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. కుప్పంలో ఇప్పటికే వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి డిజిటల్ హెల్త్ రికార్డులు నమోదు చేసి చికిత్సలు అందిస్తున్నామని చెప్పారు. 13 పీహెచ్‌సీలు, ఏరియా ఆస్పత్రుల ద్వారా 1.29 లక్షల మందికి వైద్య సేవలు అందుతున్నాయని తెలిపారు. ఈ ఏడాది చివరి నాటికి రాష్ట్రంలోని ఐదు కోట్ల మంది ఆరోగ్యాన్ని పరిరక్షించేలా చర్యలు చేపడుతున్నామని చెప్పారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ఇల్లు ఉండాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని సీఎం తెలిపారు. పేదలకు పట్టాభిషేకం కార్యక్రమం ద్వారా ఇల్లు, ఇంటి స్థలం అందించేలా చర్యలు చేపడుతున్నామని చెప్పారు. కంగుందిలో దశాబ్దాలుగా పరిష్కారం కాని భూ సమస్యను పరిష్కరించి 320 మందికి పట్టాలు అందించామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఇదే తరహాలో మీ భూమి-మీ హక్కు కార్యక్రమం ద్వారా రాజముద్రతో కూడిన పట్టాలు జారీ చేస్తున్నామని చెప్పారు.

**ప్రజలతో ముఖాముఖి... అభివృద్ధిపై అభిప్రాయాలు**

కుప్పం పర్యటనలో ముఖ్యమంత్రి రైతులు, గృహిణులు, ఉద్యోగులు, యువత, వివిధ పథకాల లబ్ధిదారులతో ముఖాముఖి నిర్వహించారు. హంద్రీనీవా కాలువ ద్వారా అందుతున్న నీటితో కలుగుతున్న ప్రయోజనాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. పీ4 కార్యక్రమం ద్వారా లభించిన ప్రయోజనాలపై లక్ష్మి అనే మహిళతో మాట్లాడారు. ఇటుకల బట్టీ ఏర్పాటు చేసుకునేందుకు సహకరించి తనను మహిళా పారిశ్రామికవేత్తగా తీర్చిదిద్దినందుకు సీఎంకు, టీవీఎస్ సంస్థకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. కుప్పంలోని ఓ పరిశ్రమలో ఉద్యోగం పొందిన సురేఖ అనే యువతిని ముఖ్యమంత్రి అభినందించారు. కుప్పం మెడికల్ కాలేజీ తన తండ్రి ప్రాణాలను కాపాడిందని యువ పారిశ్రామికవేత్త సుబ్రహ్మణ్యం తెలిపారు. కుప్పం అభివృద్ధిలో ప్రతి రోడ్డు, ప్రతి నీటి చుక్కలోనూ ముఖ్యమంత్రి కనిపిస్తున్నారని ఓ యువకుడు పేర్కొన్నారు. కుప్పంలో ఉత్పత్తయ్యే ఆర్గానిక్ ఉత్పత్తులను రాష్ట్రంతో పాటు ఇతర రాష్ట్రాల్లోనూ విక్రయిస్తున్నట్లు మరో యువకుడు వివరించారు. హంద్రీనీవా సుజల స్రవంతి కుప్పం బ్రాంచ్ కెనాల్‌లో నీటి ప్రవాహాన్ని లైవ్ వీడియో ద్వారా సభకు చూపించారు. కుప్పం అభివృద్ధిపై కడా నిర్వహించిన వీడియో కాంటెస్టులో విజేతలైన సుబ్రహ్మణ్యం, విక్కీలను సీఎం సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు జిల్లా ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులు, కుప్పం స్థానిక అధికారులు పాల్గొన్నారు.



# సూర్యప్రభ వాహనంపై శ్రీ మలయప్పస్వామి దివ్య వైభవం

**గోవింద నామస్మరణతో మార్మోగిన తిరుమాడ వీధులు**

తిరుమల, సింధూరదర్శిని: తిరుమల శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో ఏడో రోజైన సోమవారం ఉదయం 8 గంటలకు శ్రీ మలయప్పస్వామివారు సూర్యప్రభ వాహనంపై భక్తులకు దివ్యదర్శనం అనుగ్రహించారు. సూర్యకాంతుల మధ్య స్వామివారు సూర్యప్రభ వాహనంపై తిరుమాడ వీధుల్లో విహరిస్తుండగా, భక్తులు భక్తిపారవశ్యంతో "గోవిందా.. గోవిందా" అంటూ నామస్మరణ చేశారు. వాహనం ముందు భక్తబృందాలు చెక్కభజనలు, కోలాటాలతో స్వామివారిని కీర్తించగా, మంగళవాయిద్యాల నడుమ వాహనసేవ వైభవంగా సాగింది. భక్తులు అడుగడుగునా కర్పూరహారతులు సమర్పిస్తూ స్వామివారిని దర్శించుకున్నారు.

**ఆయురారోగ్యాలను ప్రసాదించే సూర్యప్రభ వాహనం**

సూర్యుడు సకల జీవులకు ఆరోగ్యాన్ని, చైతన్యాన్ని ప్రసాదించే దివ్యశక్తికి ప్రతీక. ప్రకృతికి చైతన్యప్రదాతగా, సకల రోగ నివారకుడిగా సూర్యుడిని సూర్యనారాయణుడిగా భక్తులు ఆరాధిస్తారు. సూర్యమండల మధ్యవర్తిగా శ్రీమన్నారాయణుడు కొలువై ఉన్నారనే ఆధ్యాత్మిక విశ్వాసానికి సూర్యప్రభ వాహనసేవ ప్రతీకగా నిలుస్తుంది. సూర్యప్రభ వాహనంపై శ్రీ మలయప్పస్వామి వారిని దర్శించుకోవడం ద్వారా ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, భోగ భాగ్యాలు, సత్సంతాన సంపద కలుగుతాయని భక్తుల విశ్వాసం.

**22న వైభవంగా రథోత్సవం**

శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో ఎనిమిదో రోజైన మంగళవారం ఉదయం 7 గంటలకు రథోత్సవం వైభవంగా జరుగనుంది. వాహనసేవలో శ్రీశ్రీశ్రీ పెద్దజీయర్‌స్వామి, శ్రీశ్రీశ్రీ చిన్నజీయర్‌స్వామి, టీటీడీ ఈవో శ్రీ ముద్దాడ రవిచంద్ర, అదనపు ఈవో శ్రీ సి.హెచ్. వెంకయ్య చౌదరి, సీవీఎస్వో శ్రీ కె.వి. మురళీకృష్ణ, పలువురు బోర్డు సభ్యులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.





# ఆత్మకూరులో అభివృద్ధి జాతర

ఆత్మకూరు( సింధూర దర్శిని) 21 సెప్టెంబర్ నెల్లూరు జిల్లా ; ఆత్మకూరు నియోజకవర్గ అభివృద్ధి ప్రస్థానంలో సోమవారం మరో కీలక ముందడుగు పడింది. రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి సారథ్యంలో నిర్వహించిన అభివృద్ధి కార్యక్రమాల పండుగలో భాగంగా ఒకే రోజు రూ. 53.25 కోట్ల విలువైన వివిధ అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు జరిగాయి. అదేవిధంగా ఆత్మకూరు పట్టణ మౌలిక వసతుల అభివృద్ధికి మరో రూ. 29 కోట్ల పనులకు కూడా ముందడుగు పడింది. రాష్ట్ర మంత్రులు డాక్టర్ పొంగూరు నారాయణ, కొలుసు పార్థసారథితో పాటు రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్ రావు, శాసనమండలి సభ్యులు బీద రవిచంద్ర, కావలి ఎమ్మెల్యే కృష్ణారెడ్డి, నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల తదితరులు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు మంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులకు ఘనస్వాగతం పలికారు. ఆత్మకూరు మున్సిపల్ కార్యాలయ ఆవరణలో రూ. 45 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు పైలాన్‌ను మంత్రులు ఆవిష్కరించారు. పలు కీలక పనులకు శంకుస్థాపనలు చేసి అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. అనంతరం ఎన్డీఏ కూటమి ఆధ్వర్యంలో నిర్వహించిన బైక్ ర్యాలీని మంత్రులు ప్రారంభించారు. భారీగా కార్యకర్తలు, స్థానిక నాయకులు పాల్గొనడంతో ర్యాలీ కోలాహలంగా సాగింది.

**టిడ్కో కాలనీలో శ్రీవారి ఆలయ ప్రారంభం**

ఆత్మకూరు టిడ్కో గృహ సముదాయంలో రాష్ట్రంలోనే మొట్టమొదటిసారిగా రూ. 75 లక్షలతో నిర్మించిన శ్రీ కోదండరామస్వామి ఆలయాన్ని మంత్రులు, ప్రజా ప్రతినిధులు ప్రారంభించారు. మహాకుంభాభిషేక కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తుల జయజయధ్వానాలతో టిడ్కో కాలనీ ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. ఈ సందర్భంగా మంత్రి ఆనం మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 5,000 ఆలయాల నిర్మాణ లక్ష్యంలో భాగంగా ఇప్పటికే 2,000 ఆలయాల పనులు ప్రారంభమయ్యాయని మంత్రి ఆనం రామ నారాయణరెడ్డి తెలిపారు. మరో 1,000 ఆలయాలకు ప్రణాళిక సిద్ధమవుతోందని చెప్పారు. ఈ లక్ష్యంలో భాగంగా ఆత్మకూరు టిడ్కో కాలనీలో నిర్మించిన ఆలయం పూర్తయిందని పేర్కొన్నారు.

**టిడ్కో వాసులకు తాగునీటి సమస్యకు పరిష్కారం**

టిడ్కో కాలనీలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు నుడా నిధులతో రూ. 1కోటి విలువైన పైప్ లైన్ పనులకు మంత్రులు శంకుస్థాపన చేశారు. పాత పైప్‌లైన్ల కారణంగా ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించి ప్రజలకు నిరంతర తాగునీటి సరఫరా కల్పించేందుకు చర్యలు చేపడుతున్నట్లు మంత్రి ఆనం తెలిపారు.

**విద్యుత్ సబ్‌స్టేషన్లకు శంకుస్థాపన**

పెరుమాళ్లపాడు, అన్నారెడ్డిపాళెం -మక్తాపురం ప్రాంతాల్లో సుమారు రూ. 7 కోట్లతో నూతన విద్యుత్ సబ్‌స్టేషన్ల నిర్మాణానికి శంకుస్థాపనలు జరిగాయి. విద్యుత్ సరఫరా వ్యవస్థను మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా పనులు చేపడుతున్నట్లు తెలిపారు.

> ఒకే రోజు రూ.53.25కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టిన మంత్రులు ఆనం, నారాయణ, పార్థసారథి
>
> టిడ్కో కాలనీల్లో రాష్ట్రంలో మొట్టమొదటి శ్రీవారి ఆలయ ప్రారంభంతో ఆధ్యాత్మిక శోభ
>
> మరో రూ.29 కోట్ల ఆత్మకూరు పట్టణ మౌలిక వసతుల పనులకు ముందడుగు
>
> రాష్ట్రవ్యాప్తంగా 5 వేల శ్రీవాణి ఆలయాల నిర్మాణం
>
> దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి
>
> రాష్ట్రవ్యాప్తంగా టిడ్కో కాలనీల్లో ఆలయాల నిర్మాణం
>
> పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ
>
> యువతకు 20 లక్షల ఉద్యోగాల లక్ష్యం
>
> మంత్రి పార్థసారథి



**ఆత్మకూరుకు మరో రూ.29 కోట్ల అభివృద్ధి**

ఆత్మకూరు మున్సిపాలిటీ పట్టణ మౌలిక వసతుల అభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మరో రూ. 29 కోట్లు మంజూరు చేశారని మంత్రి ఆనం తెలిపారు. సెప్టెంబర్ 22న కుప్పం నుంచి ముఖ్యమంత్రి వర్చువల్‌గా ఈ పనులకు శంకుస్థాపన చేయనున్నారని వెల్లడించారు. మినీ బైపాస్ రహదారిని సింగిల్ లేన్ నుంచి నాలుగు లేన్ల రహదారిగా విస్తరించినట్లు మంత్రి ఆనం తెలిపారు. సెంట్రల్ డివైడర్, సెంట్రల్ లైటింగ్ పనులకు టెండర్లు పూర్తయ్యాయని, త్వరలో పనులు ప్రారంభమవుతాయని చెప్పారు.

**185 కుటుంబాలకు రూ.1.46 కోట్ల సీఎంఆర్ఎఫ్**

అభివృద్ధి కార్యక్రమాలతో పాటు సంక్షేమానికి కూడా ప్రాధాన్యం ఇస్తూ 185 కుటుంబాలకు రూ. 1.46 కోట్ల ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. అభివృద్ధి, సంక్షేమం రెండింటినీ సమాంతరంగా ముందుకు తీసుకెళ్లడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రులు పేర్కొన్నారు.

**రాష్ట్రవ్యాప్తంగా టిడ్కోకాలనీల్లో ఆలయాల నిర్మాణం**
**పురపాలక శాఖ మంత్రి నారాయణ**

టిడ్కో ఇళ్ల నిర్మాణానికి గతంలో చేపట్టిన చర్యలను వివరిస్తూ రాష్ట్ర మున్సిపల్‌శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ మాట్లాడారు. టిడ్కో ఇళ్ల నిర్మాణం జరుగుతున్న 163 ప్రాంగణాల్లో మంత్రి ఆనం రామ నారాయణరెడ్డి ప్రత్యేక చొరవతో ఆలయాల నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. టిడ్కో ఇళ్ల పనులను పూర్తి చేసి లబ్ధిదారులకు గృహప్రవేశాలు చేయించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని చెప్పారు. ఆత్మకూరు మున్సిపాలిటీ అభివృద్ధికి రూ. 29 కోట్ల నిధులు మంజూరయ్యాయని, అమృత్ 2.0 కింద పనులు చేపట్టి ప్రతి ఇంటికీ మంచినీటి కుళాయి కనెక్షన్ ద్వారా నదీజలాలు అందించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి నారాయణ తెలిపారు.

**యువతకు ఉద్యోగాలు, పరిశ్రమలపై దృష్టి**
**మంత్రి పార్థసారథి**

రాష్ట్రంలో అభివృద్ధి కార్యక్రమాలతో పాటు యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. రాబోయే ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాల కల్పన లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని చెప్పారు. రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించి పరిశ్రమల ఏర్పాటుతో స్థానికంగానే యువతకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. పోలవరం, వెలుగొండ తదితర ప్రాజెక్టులను పూర్తి చేయడంతో పాటు ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు.

**అభివృద్ధి బాటలో ఆత్మకూరు**

ఒకే రోజు రూ. 53.25 కోట్ల విలువైన అభివృద్ధి పనులు, మరో రూ. 29 కోట్ల పట్టణ మౌలిక వసతుల పనులకు ముందడుగు, టిడ్కో కాలనీలో శ్రీవారి ఆలయ ప్రారంభం, తాగునీరు-విద్యుత్-రహదారుల అభివృద్ధి, 185 కుటుంబాలకు రూ. 1.46 కోట్ల సీఎంఆర్ఎఫ్ సహాయం వంటి కార్యక్రమాలతో ఆత్మకూరులో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ఉత్సాహభరితంగా సాగాయి. మంత్రి ఆనం రామనారాయణరెడ్డి సారథ్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమాల్లో మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నుడా చైర్మన్, జిల్లా కలెక్టర్, ప్రజాప్రతినిధులు, అధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే పై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదు

**మండల అధ్యక్షులు దువ్వూరు రాజశేఖర్ రెడ్డి**



గూడూరు (సింధూరదర్శిని) 21 సెప్టెంబర్ నెల్లూరుజిల్లా; గూడూరు నియోజకవర్గం అభివృద్ధికి, పేద ప్రజల శ్రేయస్సు కోసం నిరంతరం శ్రమిస్తున్న ఎమ్మెల్యే సునీల్ అన్న పై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని చిల్లకూరు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు దువ్వూరు రాజశేఖర్ రెడ్డి హెచ్చరించారు. చిల్లకూరు మండలం వల్లిపేడులో జరిగిన వైయస్సార్సీపి నాయకుల సమావేశంలో ఆ పార్టీ సమన్వయకర్త బూదూరు గురవయ్య ఎమ్మెల్యేపై చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ వారు మండల నాయకులతో కలిసి చిల్లకూరులోని జ్యోతి వే బ్రిడ్జి వద్ద ఉన్న తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...కూటమి ప్రభుత్వంలో జరుగుతున్న అభివృద్ధి పనులను చూసి ఓర్వలేక వైఎస్ఆర్సిపి నాయకులు పార్టీపై బురదజల్లే ప్రయత్నాలు చేస్తున్నారని, అభివృద్ధి ఏ ప్రభుత్వంలో జరుగుతుందో ప్రజలకు బాగా తెలుసునని, పెన్నల్ల నమోదులో ప్రజలకు అన్యాయం జరుగుతుందని మాట్లాడారని, ఏ గ్రామంలో అన్యాయం జరిగిందో నిరూపిస్తే సంతోషిస్తామని, కూటమి ప్రభుత్వంలో పేదలకు న్యాయం తప్ప అన్యాయం జరిగే ప్రసక్తే లేదని, అన్యాయాలు, వెన్నుపోట్లు మీ ప్రభుత్వంలోనే జరిగాయని, ప్రశాంతంగా ఉన్న గ్రామాల్లో ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టే పద్ధతిని మానుకోవాలని, ఎమ్మెల్యే సునీల్ అన్న మీద అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని మరొక సారి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి నెలటూరు చిరంజీవి, పెనుబోలు జానకిరామిరెడ్డి, లైవ్ స్టాక్ డైరెక్టర్ గుండాల లీలావతి, గూడూరు నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షులు రావుల వెంకటేశ్వర్లు గౌడ్,కమ్మవారిపాలెం మాజీ సర్పంచ్ చిట్టేటి నారాయణ, పెజ్జాయి ప్రవీణ్ కుమార్ రెడ్డి, భాస్కర్ రెడ్డి,కీరవాణి, త్రివిక్రమ్, వెంకటేశ్వర్లు నాయుడు, వెంకట కృష్ణయ్య,గుండాల శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## పిజిఆర్ఎస్‌లో ప్రజలు ఇచ్చిన అర్జీలకు స్పందన ఉండటం లేదు

**- సిపిఐ నాయకులు సివిఆర్ కుమార్ -**




గూడూరు (సింధూర దర్శిని) 21 సెప్టెంబర్ నెల్లూరు జిల్లా; నామమాత్రంగా పిజిఆర్ఎస్‌లో ప్రజల విజ్ఞప్తులు అధికారులు తీసుకుంటున్నారని సమస్యలు అయితే పరిష్కరించడం లేదని గూడూరు పురపాలక సంఘటన ప్లానింగ్ అధికారిపై అనేక అవినీతిపై ఫిర్యాదు చేసిన అధికారులు పట్టించుకోవడం లేదని సిపిఐ నాయకులు సివిఆర్ కుమార్ వెల్లడించారు. గూడూరు పట్టణంలోని పురపాలక సంఘ కార్యాలయం వద్ద సిపిఐ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. నాయకులు కమిషనర్ మల్లికార్జున్ ను కలిసి సమస్యను తెలియజేశారు. నాయకులు సివిఆర్ కుమార్ మాట్లాడుతూ ప్రతి సోమవారం అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో పిజిఆర్ఎస్ కార్యక్రమం జరుగుతుందని ప్రజలు ఎంతో ఆశతో తన సమస్యలు అధికారులకు తెలియజేస్తున్నారని అన్నారు. మున్సిపాలిటీలో పిజిఆర్ఎస్ లో ప్రజలు ఇచ్చిన అర్జీలకు స్పందన ఉండడం లేదని గత మూడు నెలల ముందు టౌన్ ప్లానింగ్ అధికారిపై ఫిర్యాదు చేశామని ఆయనపై చర్యలు ఏమి తీసుకోలేదని అన్నారు. ఉన్నతాధికారులు స్పందించి ప్రజల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో శశి కుమార్ ,సునీల్ ,జమాల్ బాషా, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ముత్యాలమ్మ అమ్మవారి హుండీ లెక్కింపు

**ఆలయ ఈవో నవీన్ కుమార్, చైర్మన్ దశరథరామిరెడ్డి**

గూడూరు (సింధూరదర్శిని) 21 సెప్టెంబర్ నెల్లూరుజిల్లా; చిల్లకూరు మండలం తూర్పుకనుపూరు గ్రామంలో స్వయంభూగా వెలసిన శ్రీశ్రీశ్రీ ముత్యాలమ్మ అమ్మవారి దేవస్థానం హుండీ లెక్కింపు సోమవారం నిర్వహించారు. ఈ హుండీ లెక్కింపులో రిటైర్డ్ బ్యాంకు ఉద్యోగుల అసోసియేషన్ సభ్యుల ఆధ్వర్యంలో జరిగిన ఈ లెక్కింపులో 4 నెలల 11 రోజులకు గాను హుండీ ఆదాయం వెల్లడైంది. ముత్యాలమ్మ అమ్మవారి హుండీ ద్వారా రూ. 34,86,114లు, శ్రీపోలేరమ్మ అమ్మవారి హుండీ ద్వారా రూ. 5,06,579లు ముత్యాలమ్మతల్లీ మరియు పోలేరమ్మ తల్లీ హుండీ ఆదాయం కలిపి రూ. 39,92,693లు ఆదాయం వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ చిల్లకూరు దశరథ రామిరెడ్డి, ధర్మకర్త మండలి సభ్యులు, కార్యనిర్వహణాధికారి కె.నవీన్ కుమార్, మనుబోలు గ్రూప్ టెంపుల్స్ ఈవో మోహన్ మరియు ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.



## బాధితుడికి న్యాయం చేయాలి

**సిపిఐ నాయకులు శశి**



గూడూరు (సింధూరదర్శిని) 21 సెప్టెంబర్ నెల్లూరు జిల్లా; తిక్కవరం గ్రామానికి చెందిన వెంకటరమణయ్య కుమారులకు హోంగార్డు ఉద్యోగాలు ఇప్పిస్తానని కానిస్టేబుల్ మస్తానయ్య 12లక్షల రూపాయలు డబ్బు తీసుకొని ఉద్యోగం ఇప్పించకుండా మోసం చేశారని గూడూరు సిపిఐ నాయకులు శశి వెల్లడించారు. గూడూరు పట్టణంలోని సిపిఐ పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో నాయకులు శశి మాట్లాడుతూ చిల్లకూరు మండలం తిక్కవరం గ్రామంలో వెంకటరమణయ్య జీవనం సాగిస్తున్నాడని పక్క ఇంటిలో నివాసం ఉంటున్న కానిస్టేబుల్ మస్తానయ్య వెంకటరమణయ్యకు మీ కుమారులకు హోంగార్డు ఉద్యోగం ఇప్పిస్తానని కొంత డబ్బు పెట్టుకోవాలని కోరగా వెంకటరమణయ్య అప్పుచేసి 12 లక్షల రూపాయలు మస్తాన్ య్యకు ఇచ్చాడని తెలిపారు. డబ్బులు తీసుకుని సంవత్సరకాలం గడిచిన ఉద్యోగం ఇవ్వక పోగా డబ్బులు అడిగితే సమాధానం చెప్పడం లేదని అధికారులు కూడా చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని ఉన్నతాధికారులు స్పందించి బాధితుడికి న్యాయం చేయాలని కోరారు. ఈ సమావేశంలో సునీల్, వెంకటరమణయ్య కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## అర్జీదారుల సమస్యలను వేగవంతంగా పరిష్కరించండి



**జేసి మొగిలి వెంకటేశ్వర్లు**

నెల్లూరు ( సింధూర దర్శిని) 21 సెప్టెంబర్ నెల్లూరు జిల్లా; ప్రతి అర్జీని క్షేత్రస్థాయిలో సమగ్రంగా పరిశీలించి అర్జీదారుడు సంతృప్తి చెందే విధంగా నిర్ణీత గడువులోపు పరిష్కరించాలని జేసి మొగిలి వెంకటేశ్వర్లు అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో జేసి మొగిలి వెంకటేశ్వర్లతో పాటు డిఆర్వో విజయ కుమార్, ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా జేసి మాట్లాడుతూ, ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి, పారదర్శకంగా విచారణ నిర్వహించి అర్జీదారుడు సంతృప్తి చెందేలా నిర్ణీత గడువులోపు తప్పనిసరిగా పరిష్కరించాలని ఆదేశించారు. పీజీఆర్ఎస్‌కు వచ్చే అర్జీదారులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా జిల్లా యంత్రాంగం ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. ప్రత్యేక క్యూ లైన్లు, తాగునీటి సదుపాయం, ఉచిత భోజన ఏర్పాట్లు కల్పించింది. రెవెన్యూ సంబంధిత సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటుచేయడంతో పాటు, అర్జీదారులకు అవసరమైన ప్రాథమిక వైద్య సేవలు అందుబాటులో ఉండేలా ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.






# గిరిజనుల సమగ్రాభివృద్ధికి ఐదేళ్లలో రూ.750కోట్ల ప్రణాళిక

## విద్య, మౌలిక వసతులు, ఉపాధి, జీవనోపాధికి ప్రాధాన్యత

నెల్లూరు( సింధూరదర్శిని)21 సెప్టెంబర్ నెల్లూరు జిల్లా; గిరిజనుల విద్యా, వైద్య, ఆరోగ్య, సామాజిక, ఆర్థిక అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ రానున్న ఐదు ఆర్థిక సంవత్సరాల్లో దశలవారీగా రూ.750 కోట్ల నిధులతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు ప్రతిపాదనలు రూపొందించినట్లు గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ తెలిపారు. నెల్లూరులో సోమవారం 11వ గవర్నింగ్ బాడీ సమావేశం పివో, ఐటిడిఏ కార్యాలయంలో నిర్వహించారు. సమావేశంలో గిరిజనుల సమగ్ర అభివృద్ధికి సంబంధించిన 23 అంశాలపై చర్చించి పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. సమావేశం అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ మీడియాతో మాట్లాడుతూ.. వచ్చే ఐదేళ్లలో దశలవారీగా సుమారు రూ.750కోట్లతో గిరిజన ప్రాంతాల్లో మౌలిక వసతులు, విద్య, ఉపాధి, జీవనోపాధి కార్యక్రమాలను అభివృద్ధి చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. గిరిజన ప్రాంతాల్లో రహదారులు, గృహాలు, ఇతర ప్రాథమిక సదుపాయాల్లో ఉన్న లోటుపాట్లను గుర్తించి పరిష్కరించడంతో పాటు గురుకుల, ఆశ్రమ పాఠశాలల్లో 100 శాతం విద్యార్థుల నమోదు లక్ష్యంగా ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించనున్నట్లు తెలిపారు.పదో తరగతి అనంతరం విద్యార్థుల విద్యా ప్రగతిని నిరంతరం పర్యవేక్షించేలా ప్రత్యేక డేటాబేస్ రూపొందించి, ఉన్నత విద్య, వృత్తి విద్య, నైపుణ్య శిక్షణ ద్వారా వారు స్థిరపడే వరకు మార్గనిర్దేశం చేయాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు.ఉపాధి లేని యానాది యువతను గుర్తించి ఆధునిక రంగాల్లో నైపుణ్య శిక్షణ అందించేందుకు దశలవారీగా సుమారు రూ.కోటి కేటాయించేలా కార్యాచరణ రూపొందిస్తున్నట్లు తెలిపారు. అలాగే మత్స్య, వ్యవసాయ, ఉద్యానవన తదితర రంగాల్లో స్థానికంగా జీవనోపాధి అవకాశాలు కల్పించి గిరిజనుల వలసలను అరికట్టేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాలో ఆధార్ లేని గిరిజనులను గుర్తించి ఇప్పటికే 15 వేల మందికి పైగా ఆధార్ సేవలు అందించామని, మిగిలిన వారికి కూడా ప్రత్యేక డ్రైవ్ ద్వారా ఆధార్ అందేలా చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు.ప్రభుత్వ పథకాలతో పాటు సి ఎస్ ఆర్, పి పి పి వివిధ శాఖల నిధుల కన్వర్జెన్స్ ద్వారా అదనపు వనరులను సమీకరించి గిరిజన ప్రాంతాల అభివృద్ధికి వినియోగించనున్నట్లు తెలిపారు. షెడ్యూల్డ్ ఏరియాలతో సమానంగా ప్లెయిన్ ఏరియాల్లో నివసిస్తున్న చెంచు, యానాది, ఎరుకల తదితర గిరిజన సముదాయాల అభివృద్ధిపైనా ప్రత్యేక దృష్టి సారిస్తామని చెప్పారు. విద్య, మౌలిక వసతులు, ఉపాధి, జీవనోపాధి, నైపుణ్యాభివృద్ధి వంటి అంశాలను సమగ్రంగా తీసుకుని కాలపరిమితితో కార్యక్రమాలను అమలు చేయాలని గవర్నింగ్ బాడీ సమావేశంలో నిర్ణయించినట్లు గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ తెలిపారు.సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి మాట్లాడుతూ... ఐటీడీఏ పరిధిలోని 92 గురుకుల పాఠశాలల్లో పూర్తిస్థాయి ప్రవేశాలు కల్పించడంతో పాటు పదో తరగతిలో 97 శాతం ఉత్తీర్ణత సాధించడం, 259 మంది విద్యార్థులు ఐఐటీ, ట్రిపుల్ ఐటీ, జేఈఈ మెయిన్స్‌కు అర్హత సాధించడం సంతోషకరమన్నారు. గిరిజనుల విద్య, వైద్యం, ఆరోగ్యం, సామాజిక అభివృద్ధికి రానున్న ఐదు ఆర్థిక సంవత్సరాలకు రూ.750కోట్ల నిధులు కేటాయించాలని గవర్నింగ్ బాడీ సమావేశంలో తీర్మానించినట్లు తెలిపారు. గిరిజనుల భూముల పరిరక్షణకు, ఆధార్ కార్డుల జారీకి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, నెల్లూరు ఐటీడీఏకు షెడ్యూల్డ్ ఏరియా ప్రయోజనాలు వర్తించేలా కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. గిరిజన కాలనీల అభివృద్ధి, ఉపాధి అవకాశాల కోసం పరిశ్రమల సీఎస్ఆర్ నిధులను వినియోగించేలా చర్యలు చేపట్టాలని, ఐటీడీఏ సమావేశాలను ఆరు నెలలకు ఒకసారి నిర్వహించాలని కోరారు. ఈ సమావేశంలో పివో శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాకు మొబైల్ ఫోరెన్సిక్ యూనిట్

## పచ్చజెండా ఊపి ప్రారంభించిన జిల్లా ఎస్పీ డా. అజిత వేజెండ్ల




నెల్లూరు (సింధూర దర్శిని) 21సెప్టెంబర్ నెల్లూరుజిల్లా; జిల్లా పోలీసులకు నేర పరిశోధనలో శాస్త్రీయ ఆధారాల సేకరణను మరింత వేగవంతం చేసేందుకు ప్రత్యేకంగా రూపొందించిన మొబైల్ ఫోరెన్సిక్ వాన్‌ను జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ డా. అజిత వేజెండ్ల పచ్చజెండా ఊపి ప్రారంభించారు. నేరస్థలానికి నేరుగా చేరుకుని అక్కడికక్కడే ఆధారాలను గుర్తించడం, డాక్యుమెంటేషన్ చేయడం, సేకరించడం, భద్రపరచడం, ప్రాథమికంగా పరిశీలించడం వంటి సేవలను అందించేలా ఈ వాహనం రూపొందించబడింది. నేరస్థల పరిరక్షణ, సాధారణ భౌతిక ఆధారాల సేకరణ, సాధారణ కంటికి కనిపించని ఆధారాలను గుర్తించేందుకు హై-ఇంటెన్సిటీ ఫోరెన్సిక్ లైట్ వంటి అధునాతన పరికరాలు ఇందులో ఉన్నాయి.ఈ మొబైల్ ఫోరెన్సిక్ వాన్‌లో రక్తం, వీర్యం వంటి జీవ ఆధారాల ప్రాథమిక పరీక్ష-సేకరణ కిట్లు, డీఎన్ఏ నమూనా సేకరణ కిట్, మాదకద్రవ్యాలు మరియు పేలుడు పదార్థాల స్క్రీనింగ్ కిట్లు, గన్‌షాట్ రెసిడ్యూ సేకరణ కిట్, బుల్లెట్ హోల్ పరిశీలన కిట్, ట్రేస్ ఎవిడెన్స్ కోసం స్టీరియో మైక్రోస్కోప్, డీఎస్ఎల్ఆర్ కెమెరా,బాడీ-వోర్న్ కెమెరా--జీపీఎస్, సీసీటీవీ/డాష్‌బోర్డ్ కెమెరా, వెయింగ్ బ్యాలెన్స్, మినీ రిఫ్రిజిరేటర్, ఎల్ఈడీ స్క్రీన్, పబ్లిక్ అనౌన్స్‌మెంట్ సిస్టమ్, బార్‌కోడ్ స్కానర్--థర్మల్ ప్రింటర్, జనరేటర్ వంటి పరికరాలతో పాటు డిజిటల్ ఇన్వెస్టిగేషన్ కిట్, ఫోరెన్సిక్ ఇమేజర్, పెన్‌డ్రైవ్, మెమరీ కార్డులు, ఎస్ఎస్‌డీ స్టోరేజ్, డిజిటల్ డివైస్‌ల అక్విజిషన్-ఇమేజింగ్-ట్రయాజ్ టూల్, ఫీల్డ్ ట్రయాజ్ పరికరాలు అన్నింటిని జిల్లా ఎస్.పి పరిశీలించారు. అనుమానాస్పద అగ్ని/గ్యాస్ ఘటనల్లో గ్యాస్ గుర్తింపు, డిజిటల్ ఆధారాల సేకరణ--భద్రపరచడం వంటి సేవలు కూడా అందించగల ఈ వాన్ ద్వారా నేరస్థల స్పందన మరింత వేగవంతమై, శాస్త్రీయ ఆధారాల సేకరణ, ఆధారాల భద్రత, కేసుల దర్యాప్తులో పోలీసు అధికారులకు మెరుగైన ఫోరెన్సిక్ సహకారం అందనుంది.ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ తో పాటు , చంద్ర మోహన్ , ఫింగర్ ప్రింట్ డక్లూస్ టీ శరత్ బాబు అడ్మిన్ హరిబాబు వెల్ఫేర్ రాజారావు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# వైభవంగా వినాయక చవితి వేడుకలు

## ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్



గూడూరు (సింధూర దర్శిని) 21 సెప్టెంబర్ నెల్లూరు జిల్లా ; గూడూరు పట్టణంలోని ముత్యాల పేటలో వినాయక చవితి వేడుకలు వైభవంగా సాగుతున్నాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ స్వామివారిని దర్శించి పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు.గూడూరు పట్టణంలోని ముత్యాల పేటలో స్థానికుల ఆధ్వర్యంలో వినాయక చవితి వేడుకలు వైభవంగా సాగుతున్నాయి. విజయదుర్గా ఉపపీఠం నిర్వాహకులు కోటా సునీల్ కుమార్ ఆధ్వర్యంలో మహాగణపతి హోమం పూర్ణాహుతి కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ స్వామివారిని దర్శించి పూజలు నిర్వహించారు. స్థానికులు ఆయనకి ఘన స్వాగతం పలికి సన్మానించారు. ఎమ్మెల్యే అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. భక్తులు భారీగా తరలివచ్చి అన్నప్రసాదాలు స్వీకరించారు. ఎమ్మెల్యే సునీల్ కుమార్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ముత్యాల పేటలో వినాయక చవితి వేడుకలు ఘనంగా నిర్వహించడం అభినందనీయమని, గణనాథుని ఆశీస్సులతో ప్రజలందరు సుఖసంతోషాలతో ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో పెటేటి చంద్రనిల్, మునిగిరేష్ నయుం, పులిమి శ్రీనివాసులు, దయాకర్, వైయస్సార్, బాలు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# బ్రహ్మోత్సవాలలో శ్రీ శివ లలిత భరతనాట్య కళాక్షేత్ర బృందం



గూడూరు (సింధూర దర్శిని) 21 సెప్టెంబర్ నెల్లూరుజిల్లా; గూడూరులోని డిఎన్ఆర్ హాల్ వద్ద సంస్కృతి సమ్మేళనం శ్రీ శివ లలితా భరతనాట్య కళాక్షేత్రం నాట్య బృందంలోని చిన్నారులు తిరుమల లోని బ్రహ్మోత్సవాలలో భాగంగా తిరుమాడవీధుల్లో వరుసగా మూడు రోజులు ప్రదర్శనలు చేశారు. ఆదివారం సాయంత్రం నాదనీ రాజనంలో శ్రీనివాస కళ్యాణంలో నృత్య ప్రదర్శనలు చేసినారు. చిన్నారుల తల్లిదండ్రులు ఎంతో ఆనందంగా ఉందని గురువు అయిన పిండి మల్లికకు అభినందనలు తెలిపారు. సంస్కృతి సమ్మేళనం ప్రిన్సిపల్ అయిన పిండి.మల్లిక పది రోజుల బ్రహ్మోత్సవాల కార్యక్రమంలో ఐదు రోజులు ఐదు వాహనాల ముందర సుహర్షిని, ప్రజ్ఞ, వైష్ణవి ప్రియ, రూప లహరి, విశాలాక్షి, సంజిత, మధుర, నైనిక, వార్షిక, వైష్ణవి, భవిష్య చిన్నారులచే నృత్య ప్రదర్శన అందులో గరుడ వాహనం ముందు చిన్నారులు నృత్యం చేయడంమరియు నాదనీరాజనంలో చేయడం చాలా ఆనందదాయకంగా ఉందని పిండి మల్లిక వెంకయ్య తెలిపారు. ఇందుకు కారణం అయినా తన గురువు అయిన లలితాంబ కి, మునిగిరీష్,తిరుపతి మ్యూజిక్ అండ్ డాన్స్ కాలేజ్ ప్రిన్సిపల్ అయిన ముద్దుబాల కి మరియు కాలేజీలో డాన్స్ లెక్చరర్ అయిన సెరత్ చంద్రకి కృతజ్ఞతలు తెలిపారు.

# ఘనంగా గురజాడ అప్పారావు జయంతి వేడుకలు



గూడూరు( సింధూర దర్శిని) 21 సెప్టెంబర్ నెల్లూరు జిల్లా; చిల్లకూరు మండల పరిధిలోని పాలిచర్ల గ్రామం నందు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నవయుగ వైతాళికుడు, మహాకవి, గురజాడ అప్పారావు 164వ జయంతి సందర్భంగా ఆ మహనీయుని చిత్రపటానికి పుష్ప అలంకరణ కావించి ఆధునిక వ్యవహార తెలుగు సాహిత్య దినోత్సవం ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పి అనసూయ మాట్లాడుతూ కన్యాశుల్కం నాటకం, దేశభక్తి గీతం, పుత్తడిబొమ్మ పూర్ణమ్మ, కన్యక వంటి రచనలతో తెలుగు సాహిత్యానికనలేని సేవ చేసిన మహనీయుడు గురజాడ అప్పారావు అని, రాష్ట్ర ప్రభుత్వం ఆయన గుర్తించి ఆయన జయంతిని రాష్ట్ర పండుగ చేయడం చాలా సంతోషమని తెలిపారు. తెలుగు భాషా ఉపాధ్యాయులు దేశిరెడ్డి ప్రజేంద్ర రెడ్డి మాట్లాడుతూ ముత్యాల సరాలు చందస్సులో అందరికీ సులభంగా అర్థమయ్యే వ్యవహారిక భాషలో రచనలు చేశారని, కన్యాశుల్కం బాల్యవివాహాల నిరసన, చారిత్రక పరిశోధన, దిద్దుబాటు,సంస్కర్త హృదయం, పిల్లల కోసం మిను గురులు, లవణ రాజు కల, తెలుగులో ప్రసిద్ధి చెందిన సంఘసంస్కరణకు కన్యాశుల్కం నాటకం రాసిన సుప్రసిద్ధుడు ఈ మహనీయుని స్మరించడం ప్రతి ఒక్కరి బాధ్యతని, వెలుగు జాడ మన గురుజాడ అని చెప్పాడు. పిల్లలచే పుత్తడిబొమ్మ పూర్ణమ్మ గేయాన్ని, దేశభక్తి గీతాన్ని, చిత్రలేఖన పోటీని నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ చంద్రశేఖర్, తెలుగు ఉపాధ్యాయుని నాగభూషణమ్మ, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# తాజా వేడి భోజనం - అంగన్వాడి భోజనం ఇంటి భోజనం లాంటిదే

## చిల్లకూరు మండల స్థాయిలో అంగన్వాడీ కార్యకర్తలకు అవగాహన సమావేశం

గూడూరు(సింధూరదర్శిని) 21 సెప్టెంబర్ నెల్లూరు జిల్లా; తొమ్మిదవ జాతీయ పోషణ మాసోత్సవాల్లో భాగంగా చిల్లకూరు మండల స్థాయిలో అంగన్వాడీ కార్యకర్తలకు ప్రత్యేక అవగాహన సమావేశం నిర్వహించారు. పోషణ మాసోత్సవాల థీమ్--2 తాజా వేడి భోజనం"లో భాగంగా "అంగన్వాడి భోజనం-ఇంటి భోజనం లాంటిదే" అనే కార్యక్రమంపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా తల్లుల సమక్షంలో అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలకు తాజా వేడి భోజనం వడ్డించడం, నిర్ణీత మెనూ పాటించడం, భోజనం అనంతరం పిల్లల స్పందనను నమోదు చేయడం వంటి అంశాలపై అంగన్వాడీ కార్యకర్తలకు వివరించారు. అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలకు రుచికరమైన, నాణ్యమైన, పోషక విలువలతో కూడిన వేడి భోజనం అందించడం ద్వారా పిల్లల ఆరోగ్యం, పోషక స్థితి



మెరుగుపడుతుందని తెలిపారు.అదేవిధంగా తల్లులు తమ పిల్లల ఆకలి స్థాయిని పరిశీలించే ఆకలి పరీక్ష నిర్వహించాలని, పిల్లలు భోజనం ఎంత మేరకు తీసుకుంటున్నారు, ఏ ఆహారాన్ని ఇష్టపడుతున్నారు అనే విషయాలను గమనించి నమోదు చేయాలని అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా గూడూరు ప్రాజెక్టు సీడీపీఓ ఎస్.కే. మహబూబి తల్లులను ఉద్దేశించి మాట్లాడుతూ, అంగన్వాడీ కేంద్రాల్లో అందించే వేడి భోజనాన్ని పిల్లలకు క్రమం తప్పకుండా అందేలా తల్లులు సహకరించాలని సూచించారు. పిల్లల ఆరోగ్యకరమైన ఎదుగుదలకు పోషకాహారం ఎంతో ముఖ్యమని తెలిపారు.

ఈ కార్యక్రమంలో సూపర్వైజర్లు రేణుక, శివజ్యోతి, సుజనా, అంగన్వాడీ కార్యకర్తలు, తల్లులు తదితరులు పాల్గొన్నారు.

# సమీకృత వసతి గృహం నుంచి బాలిక అదృశ్యం

## బద్వేలు మండలం అట్లూరులో ఆచూకీ.. తల్లికి అప్పగించేందుకు పోలీసుల చర్యలు

బాపట్ల సింధూరదర్శిని: పట్టణంలోని సమీకృత వసతి గృహం నుంచి ఏడో తరగతి చదువుతున్న 14 ఏళ్ల బాలిక అదృశ్యమైన ఘటన సోమవారం చోటుచేసుకుంది. బాలిక తల్లి బాపట్ల పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ ఆదేశాల మేరకు జిల్లా ఎస్పీ బి.ఉమామహేశ్వర్ పోలీసు సిబ్బందిని అప్రమత్తం చేశారు. బాలిక ఆచూకీ కోసం గాలింపు చేపట్టిన పోలీసులు కడప జిల్లా బద్వేలు మండలం అట్లూరు గ్రామంలో ఆమెను గుర్తించారు. అనంతరం బద్వేలు పోలీస్ స్టేషన్‌కు తరలించి బాలికకు ఆశ్రయం కల్పించి భద్రత కల్పించారు. హాస్టల్‌లో ఉండి చదువు కోవడం ఇబ్బందిగా ఉందని, ఇంటి వద్ద ఉండి చదువుకుంటాననే ఉద్దేశంతో బాలిక వెళ్లిపోయినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

ఆధార్ కార్డుతో ప్రయాణించి నట్లు చెప్పారు. సమాచారం అంద ుకున్న హాస్టల్ వార్డెన్ ప్రమోదిని కారు ఏర్పాటు చేసుకుని బాలిక తల్లిని వెంటబెట్టుకుని బద్వేలుకు బయలుదేరారు. పోలీసులు వేగంగా స్పందించి బాలిక ఆచూకీ గుర్తించడంపై తల్లి బాపట్ల పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

# అత్యంత వైభవంగా రథోత్సవం

## అత్యంత వైభవంగా రథోత్సవం - ఆలయ ఈవో పెంచల కిషోర్





కాణిపాకం ( సింధూర దర్శిని) 21 సెప్టెంబర్ చిత్తూరు జిల్లా; కాణిపాకం స్వయంభు శ్రీ కాణిపాక వరసిద్ధి వినాయకస్వామి వారి దేవస్థానం వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం కన్నుల పండుగగా అత్యంత వైభవంగా రథోత్సవం నిర్వహించడం జరిగింది, ఆలయంలో ప్రత్యేక పూల అలంకరణలు, మధ్యాహ్నం ప్రారంభమైన రథోత్సవ సేవ మేళ తాళాలు, కోలాటాలు, పంజాబీ బ్యాండ్ సెట్, కేరళ వాయిద్యం, దేవత వేషధారణలు, నడుమ కాణిపాకం పురవీధుల్లో సిద్ధి బుద్ధి సమేత వరసిద్ధి వినాయక స్వామి వారు రథంపై కొలువు దీని భక్తులకు దర్శనమిచ్చారు, ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ మణి నాయుడు, ఈ.వో పెంచల కిషోర్, బోర్డు సభ్యులు, ఆలయ అధికారులు, ఉభయదారులు, స్థానికులు, పెద్ద ఎత్తున రథోత్సవ సేవలో పాల్గొన్నారు.







# పదివేల కోట్ల కేంద్ర పథకానికి వేదికకానున్న నెల్లూరు జిల్లా

29న ఉదయగిరి రామాపురంలో

జీ రామ్ జీ - పల్లె పండుగ వేడుకలు

సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ రాక

చకచకా సాగుతున్న ఏర్పాట్లు పరిశీలించిన

మంత్రులు, ఆనం, నారాయణ



నెల్లూరు( సింధూర దర్శిని) 21 సెప్టెంబర్ నెల్లూరు జిల్లా ; ఆంధ్రప్రదేశ్‌లో రూ. 10 వేల కోట్ల కేంద్ర ప్రభుత్వ పథకానికి నెల్లూరు జిల్లా వేదిక కానుంది. ఉదయగిరి నియోజకవర్గంలోని రామాపురంలో ఈనెల 29న నిర్వహించ నున్న జీ రామ్ జీ - పల్లె పండుగ కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ పాల్గొన నున్నారు. ఈనేపథ్యంలో రామాపురంలో సభా ప్రాంగణం, హెలిప్యాడ్, పార్కింగ్ తదితర ప్రాంతాల్లో ఏర్పాట్లు చకచకా సాగుతున్నాయి. రామా పురంలో జరుగుతున్న ఏర్పాట్లను రాష్ట్ర మంత్రులు ఆనం రామ నారాయణరెడ్డి, డాక్టర్ పొంగూరు నారాయణ, సీఎం ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ మంతెన వెంకట సత్యనారాయణ రాజు, ఎమ్మెల్సీ బీదారవిచంద్ర, జిల్లా కలెక్టర్ హిమాన్ను శుక్లా, ఎస్పీ అజితా వేజెండ్ల తదితరులు పరిశీలించారు. హెలిప్యాడ్, వాహనాల పార్కింగ్, సభా ప్రాంగణం, వీఐపీ రాకపోకలు, ప్రజలకు కల్పించాల్సిన సౌకర్యాలపై అధికారులతో మంత్రులు సమీక్షించారు.వివిధ శాఖలకు కేటాయించిన బాధ్యతలపై ఆరా తీశారు. కార్యక్రమానికి భారీగా ప్రజలు హాజరయ్యే అవకాశం ఉన్నందున తాగునీరు, పారిశుద్ధ్యం, ట్రాఫిక్, పార్కింగ్, విద్యుత్, వైద్య, భద్రతా ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులను ఆదేశించారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తూ ఏర్పాట్లలో ఎటువంటి లోటుపాట్లు లేకుండా చూడాలని స్పష్టం చేశారు. కోకూరువారిపల్లిలో ముఖ్యమంత్రి ప్రారంభించనున్న గోశాల వద్ద జరుగుతున్న పనులను కూడా మంత్రులు, అధికారులు పరిశీలించారు. ప్రారంభోత్సవానికి ముందే పనులను పూర్తి చేసి అవసరమైన అన్ని సౌకర్యాలను సిద్ధం చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి పాల్గొనే కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు ప్రభుత్వ యంత్రాంగం, టీడీపీ శ్రేణులు సమన్వయంతో ముందుకు సాగుతున్నాయి. రామాపురం పరిసరాల్లో ఇప్పటికే ఏర్పాట్ల సందడి నెలకొంది.

# వైభవంగా శివపార్వతుల పల్లకి సేవ





గూడూరు (సింధూర దర్శిని) 21 సెప్టెంబర్ నెల్లూరు జిల్లా ; శ్రీ భువనేశ్వరి దేవి సమేత శ్రీ మూలస్థానేశ్వర స్వామి దేవస్థానంలో ప్రతి సోమవారం పల్లకి సేవ సందర్భంగా సోమవారం సాయంత్రం స్వామి అమ్మవార్ల పల్లకీ సేవ విశేషంగా జరిగింది. ఉభయదాతలుగా పావులూరు పెంచలనాయుడు వజ్రమ్మ, పావులూరు వెంకటేశ్వర్లు నాయుడు శిరీష, సాయి తనయ మరియు కుటుంబ సభ్యులు వ్యవహరించారు. కోలాటం, మంగళవాయిద్యాలు, శివనామస్మరణతో భక్తులు అత్యధిక సంఖ్యలో పల్లకి సేవలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

## గ్రామాల అభివృద్ధి గొట్టిపాటి లక్ష్మీతోనే

**- వైసీపీని వీడి టిడిపిలోకి చేరికలు -**

దొనకొండ, సింధూరదర్శిని: గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి సంక్షేమం డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి పై ఉన్న నమ్మకం విశ్వాసంతోనే వైసీపీని వీడి టిడిపిలోకి చేరుతున్నట్లు చందవరం గ్రామానికి చెందిన వైసిపి నాయకులు తెలిపారు. దర్శి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ సమక్షంలో దొనకొండ మండలం, చందవరం గ్రామానికి చెందిన 10 వైకాపా కుటుంబాలు వైఎస్ఆర్‌సీపీ పార్టీకి రాజీనామా చేసి, టిడిపిలో చేరాయి. నూనె ప్రభుదాసు నూనె రాజేష్ నూనె లక్ష్మణ్ నూనె మరియదాసు వజ్జిగిరి యాదవ్ నూనె సంతమ్మ నూనె చాయాదేవి మురికిపిడి దానమ్మ నూనె పెద్ద జాన్ నూనె నాని తదితరులు వైసీపీని వీడి డాక్టర్ లక్ష్మి సమక్షంలో టిడిపిలో చేరారు. గ్రామ టీడీపీ లీడర్లు, కార్యకర్తల సమక్షంలో డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి పార్టీలో చేరిన వారికి పసుపు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

# శ్రీశైలం నుండి గణపయ్యకు పట్టువస్త్రాలు: ఆలయ ఈవో పెంచల కిషోర్





కాణిపాకం (సింధూర దర్శిని) 21 సెప్టెంబర్ చిత్తూరు జిల్లా; కాణిపాకం స్వయంభు శ్రీ కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి వారి దేవస్థానం 2026 వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా సోమవారం శ్రీ భ్రమరాంభిక మల్లికార్జున స్వామి వారి దేవస్థానం శ్రీశైలం నుండి శ్రీ వరసిద్ధి వినాయక స్వామి వారికి పట్టు వస్త్రాలను సమర్పించిన శ్రీశైల దేవస్థానం చైర్మన్ పోతుగుంట రమేష్ నాయుడు వీరితో పాటు స్థానిక శాసనసభ్యులు డాక్టర్ కలికిరి మురళీమోహన్ ఉన్నారు, వీరికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేసి స్వామి వారి తీర్థప్రసాదాలు, శేషవస్త్రం, చిత్రపటాన్ని అందజేసిన దేవస్థానం చైర్మన్ మణి నాయుడు, ఈ.వో పెంచల కిషోర్, ఈ కార్యక్రమంలో కాణిపాకం దేవస్థానం ట్రస్ట్ బోర్డ్ సభ్యులు చంద్రశేఖర్‌రెడ్డి, శివప్రసాద్, కృష్ణవేణి, శ్రీవాణి, అనసూయ, శ్రీశైలం దేవస్థానం ట్రస్ట్ బోర్డ్ సభ్యులు అర్చకులు, వేద పండితులు, ఆలయ అధికారులు, కాణిపాకం దేవస్థానం ఏఈఓ రవీంద్రబాబు, ధనపాల్, ధనంజయ, శ్రీశైల దేవస్థానం ఏఈఓ స్వాములు, సూపరిడెంట్లు వాసు, కోదండపాణి, అర్చకులు వేద పండితులు, స్థానిక నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# తెల్ల ముత్యాలు, వట్టివేరు, కురువేరుతో వైభవంగా స్నపన తిరుమంజనం

దివ్య మాలల మధ్య శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామివారి అభిషేకం

వేదమంత్ర ఘోషల నడుమ రంగనాయకుల మండపంలో ఆధ్యాత్మిక శోభ



తిరుమల సింధూరదర్శిని: తిరుమల శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ మలయప్పస్వామివారికి సోమవారం స్నపన తిరుమంజనం భక్తిశ్రద్ధలతో వైభవంగా జరిగింది. తెల్ల ముత్యాలు, వట్టివేరు, కురువేరు, డ్రై ఫ్రూట్స్, గాజులు, వక్క ఆకులు తదితరాలతో రూపొందించిన విశేష మాలల మధ్య స్వామి, అమ్మవార్లు దివ్య అలంకారంలో భక్తులను అనుగ్రహించారు. తిరుమల శ్రీవారి ఆలయంలోని రంగనాయకుల మండపంలో మధ్యాహ్నం 1 నుంచి 3 గంటల వరకు అర్చకస్వాములు వేదమంత్రోచ్ఛారణల నడుమ వైఖానస ఆగమోక్తంగా స్నపన తిరుమంజనం నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ మలయప్ప స్వామివారి ఉత్సవమూర్తులను ప్రత్యేక వేదికపై ఆశీనులను చేసి రంగురంగుల పుష్పాలతో సుందరంగా అలంకరించారు. ఈ సందర్భంగా స్వామి, అమ్మవార్లకు పాలు, పెరుగు, కొబ్బరినీళ్లు, తేనె, పసుపు, గంధంతో విశేష అభిషేకం చేశారు. శంఖనిధి, పద్మనిధి, సహస్రధార, కుంభధారణలతో శాస్త్రోక్తంగా స్నపనం నిర్వహించారు. స్నపన తిరుమంజనం సందర్భంగా టీటీడీ వేద పారాయణదారులు ఉపనిషత్ మంత్రాలు, దశశాంతి మంత్రాలు, పురుషసూక్తం, శ్రీసూక్తం, భూసూక్తం, నీలాసూక్తం, విష్ణుసూక్తం తదితర పంచసూక్తాలను భక్తిభావంతో పారాయణం చేశారు. అభిషేకానంతరం తిరుమల శ్రీశ్రీశ్రీ పెద్ద జీయ్యంగార్, శ్రీశ్రీశ్రీ చిన్న జీయ్యంగార్లు వివిధ దివ్య పాశురాలను పఠించారు. ఈ వేడుకలో భాగంగా తెల్ల ముత్యాలు, వట్టివేరు, కురువేరు, డ్రై ఫ్రూట్స్, గాజులు, వక్క ఆకులు, పసుపు రేకులు, రోజాలు, బటన్ చామంతి మాలలతో స్వామి, అమ్మవార్లను విశేషంగా అలంకరించారు. సుగంధ పరిమళాలు, పుష్పాల సౌరభం, వేదఘోషలు, భక్తిభావంతో రంగనాయకుల మండపం ఆధ్యాత్మిక శోభతో విరాజిల్లింది. ఈ కార్యక్రమంలో టీటీడీ ఈవో శ్రీ ముద్దాడ రవిచంద్ర, అదనపు ఈవో శ్రీ సి. హెచ్. వెంకయ్య చౌదరి, ఇతర అధికారులు పాల్గొన్నారు.



## 'సర్' ప్రక్రియ పేరుతో వికృత చేష్టలకు పాల్పడుతున్నారు: సీపీఐ నారాయణ

సర్ పేరుతో వికృత చేష్టలకు పాల్పడుతున్నారన్న నారాయణ

అద్వానీ, జైశంకర్ వంటి ప్రముఖులకు కూడా నోటీసులు జారీ చేశారని విమర్శ

వివాహానంతరం మహిళల ఇంటిపేర్లు మారడాన్ని కూడా పెద్ద సమస్యగా చూపుతున్నారని మండిపాటు

విజయవాడ సింధూరదర్శిని: ఎన్నికల సంఘం ఓటర్ల జాబితా ప్రక్షాళన (సర్) పేరుతో చేపడుతున్న వింత, వికృత చర్యలు ప్రజల ప్రాథమిక ఓటు హక్కును కాపాడేలా లేవని, విజ్ఞతలేని తీరుతో ఓటర్లను తీవ్రంగా అవమానించేలా ఉన్నాయని సీపీఐ సీనియర్ నేత నారాయణ ఘాటుగా విమర్శించారు. సర్ ప్రక్రియ పేరుతో ఎన్నికల కమిషన్ వ్యవహరిస్తున్న వైఖరి 'ఎద్దు ఈనిందంటే దూడను గాట్లో కట్టేయమన్నట్లుగా' ఉందని ఎద్దేవా చేశారు. ఓటర్ల వివరాల్లో ఏవైనా సాంకేతిక లోపాలు, తప్పులు ఉంటే వాటిని క్షేత్రస్థాయిలో సరిదిద్దాలే తప్ప, దేశ మాజీ ఉపప్రధాని ఎల్.కె. అద్వానీ, ప్రస్తుత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ వంటి అత్యున్నత ప్రముఖులకు కూడా నోటీసులు జారీ చేయడం ఏ రకమైన ప్రక్షాళన అని ఆయన నిలదీశారు. పేర్లలో చిన్నపాటి స్పెల్లింగ్ పొరపాట్లు, వివాహానంతరం మహిళల ఇంటిపేర్లు మారడం వంటి అత్యంత సహజమైన అంశాలను కూడా పెద్ద సమస్యలుగా చిత్రీకరించడం, తాతముత్తాతల పుట్టిన తేదీలను వెతకాలంటూ ప్రజలను ఇబ్బందులకు గురిచేయడం విడ్డూరంగా ఉందని నారాయణ మండిపడ్డారు. దేశంలో ఉన్న కోట్లాది మంది ఓటర్ల హక్కుల పరిరక్షణ విషయంలో ఎన్నికల సంఘం అత్యంత పారదర్శకంగా, రాజ్యాంగ బద్ధమైన నిష్పక్షపాతంతో వ్యవహరించాలని స్పష్టం చేశారు. ప్రధాని కార్యాలయం నడిపించే ఒక 'సురభి నాటకం'లో స్వయంప్రతిపత్తి గల ఎన్నికల కమిషన్ అపవిత్రమైన పావుగా మారకూడదని తీవ్ర స్థాయిలో విమర్శించారు.

## చైనాకు భారత ఎగుమతులు జోరు.. 40 శాతం వృద్ధి!

చైనాకు భారీగా పెరిగిన భారత ఎగుమతులు

గత ఐదు నెలల్లో దాదాపు 40 శాతం వృద్ధి నమోదు

ఎలక్ట్రానిక్స్ వస్తువుల ఎగుమతుల్లో గణనీయమైన పెరుగుదల

ఏఐ, డేటా సెంటర్ల వల్లే డిమాండ్ పెరిగిందంటున్న నిపుణులు

అయినప్పటికీ వాణిజ్య లోటులో పెద్దగా మార్పు లేని వైనం



భారత్ నుంచి చైనాకు ఎగుమతులు అనూహ్యంగా వృద్ధి చెందుతున్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి ఐదు నెలల్లో (ఏప్రిల్–ఆగస్టు) చైనాకు భారత ఎగుమతులు సుమారు 40 శాతం మేర పెరిగాయి. ముఖ్యంగా 'మేడ్ ఇన్ ఇండియా' ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తులు ఈ వృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నాయి. అయినప్పటికీ, ఇరు దేశాల మధ్య వాణిజ్య లోటు ఇప్పటికీ చైనాకు అనుకూలంగానే కొనసాగుతోంది. గత ఆర్థిక సంవత్సరంలో చైనాకు భారత ఎలక్ట్రానిక్స్ ఎగుమతులు మూడు రెట్లు పెరిగి 3.18 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. స్మార్ట్‌ఫోన్లు, ప్రింటెడ్ సర్క్యూట్ బోర్డులు, డిస్‌ప్లే మాడ్యూల్స్ వంటివి వీటిలో ప్రధానమైనవి. ఈ ఆర్థిక సంవత్సరం ఏప్రిల్–ఆగస్టు మధ్య కాలంలోనూ ఎలక్ట్రానిక్స్ ఎగుమతులు 15 శాతానికి పైగా పెరిగాయి. ఇదే సమయంలో ఇంజినీరింగ్ వస్తువుల ఎగుమతులు సైతం 21 శాతం మేర వృద్ధిని నమోదు చేశాయి. అంతర్జాతీయంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), డేటా సెంటర్ల కోసం అత్యాధునిక పరికరాలకు డిమాండ్ పెరగడమే ఈ వృద్ధికి ప్రధాన కారణమని పరిశ్రమ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. "ప్రపంచంలోనే అత్యంత పోటీతత్వంతో కూడిన సరఫరా వ్యవస్థలో భారత తయారీ రంగం తన విశ్వసనీయతను చాటుకుంటోంది" అని ఇండియన్ సెల్యులార్ అండ్ ఎలక్ట్రానిక్స్ అసోసియేషన్ చైర్మన్ పంకజ్ మోహింద్రూ పేర్కొన్నారు. అయితే, ఈ వృద్ధి స్వల్ప స్థాయి నుంచి ప్రారంభమవడంతో చైనాతో నెలకొన్న భారీ వాణిజ్య లోటుపై చెప్పుకోదగ్గ ప్రభావం చూపలేదు. గత ఆర్థిక సంవత్సరంలో చైనా నుంచి భారత్ దిగుమతులు 131.6 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. ప్రస్తుతం భారత ఎగుమతులకు అమెరికానే అతిపెద్ద మార్కెట్‌గా కొనసాగుతోంది.

## నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం

చీమకుర్తి, సింధూరదర్శిని: ఎస్.జి.పి.ఏ.,చీమకుర్తి శాఖ కార్యవర్గ ఎన్నికలు యు. టీ. ఎఫ్., కార్యాలయంలో సోమవారం జరిగాయి.. నూతన అధ్యక్షులుగా చల్లా శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా అంబటి వీరారెడ్డి, ట్రెజరర్ గా దొంతు సోమయ్య ను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమానికి మంత్రి లక్ష్మీనారాయణ అధ్యక్షత వహించారు. ఈ సమావేశానికి పరిశీలకులు గా జిల్లా ట్రెజరర్ శ్రీ రామకోటేశ్వరరావు హాజరైనారు.. ప్రధాన కార్యదర్శి నివేదికను బండ్ల డేవిడ్ ప్రవేశ పెట్టారు.

# పూజలో కొబ్బరికాయ ఎందుకు కొడతారు? ఈ ఆచారం వెనుక ఇన్ని అర్థాలున్నాయా?

కొబ్బరికాయను 'శ్రీఫలం'గా భావించే సంప్రదాయం – త్రిమూర్తులకు కొబ్బరికాయ ప్రతీక

కొబ్బరి నీటికి హిందూ సంప్రదాయంలో పవిత్ర స్థానం

జంతుబలికి ప్రత్యామ్నాయంగానూ వచ్చిందని విశ్వాసం

కొబ్బరికాయ పగలగొట్టడం అహంకారాన్ని వదిలేయడానికి ప్రతీక

ఏదైనా శుభకార్యం మొదలుపెట్టాలన్నా.. కొత్త ఇల్లు కట్టాలన్నా.. వాహనం కొనాలన్నా.. కొత్త వ్యాపారం ప్రారంభించాలన్నా ముందుగా కొబ్బరికాయ కొట్టడం హిందూ సంప్రదాయంలో కనిపిస్తుంది. పూజలు, వ్రతాల్లోనూ కొబ్బరికాయకు ప్రత్యేక స్థానం ఉంది. కొబ్బరికాయను 'శ్రీఫలం'గా పిలుస్తారు. అయితే శుభకార్యాల్లో కొబ్బరికాయనే ఎందుకు సమర్పిస్తారు? దాన్ని పగలగొట్టడం వెనుక ఉన్న విశ్వాసాలేంటి?

**త్రిమూర్తులకు ప్రతీకగా..**

పురాణ సంప్రదాయాల ప్రకారం కొబ్బరికాయకు దైవిక ప్రాధాన్యం ఉంది. కొబ్బరికాయపై కనిపించే మూడు గీతలు బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులకు ప్రతీకగా భావిస్తారు. శ్రీమహావిష్ణువు మానవుల సంక్షేమం కోసం లక్ష్మీదేవి, కామధేనువు, కొబ్బరి చెట్టును భూమిపైకి తీసుకొచ్చినట్లు కొన్ని పురాణ కథనాలు చెబుతున్నాయి. అందుకే కొబ్బరికాయను పవిత్రమైన ఫలంగా భావిస్తారు.

**ప్రతికూలతలు తొలగుతాయని నమ్మకం..**

కొబ్బరి నీటికి పూజల్లో ప్రత్యేక స్థానం ఉంది. కొబ్బరి నీటిని సమర్పించడం లేదా చల్లడం ద్వారా ప్రతికూల శక్తులు తొలగిపోతాయని సంప్రదాయ విశ్వాసం. ఇంట్లో శాంతి, సంతోషం, సిరిసంపదలు పెరుగుతాయని కూడా కొందరు నమ్ముతారు. వాస్తు సంబంధిత కొన్ని లోపాలు తొలగుతాయని భావించే సంప్రదాయాలు కూడా ఉన్నాయి.

**కొత్త పనికి శుభారంభం..**

కొత్త ఇంటి నిర్మాణం ప్రారంభించేటప్పుడు, కొత్త వాహనం కొనుగోలు చేసినప్పుడు, వ్యాపారం మొదలుపెట్టేటప్పుడు కొబ్బరికాయ కొట్టడం కనిపిస్తుంది. ఇలా చేయడం వల్ల ప్రారంభించే పనికి దైవ ఆశీస్సులు లభిస్తాయని నమ్మకం. ఎలాంటి ఆటంకాలు లేకుండా



పని సజావుగా సాగుతుందని విశ్వసిస్తారు.

**బలికి బదులుగా కొబ్బరికాయ?**

కొన్ని పురాణ, జానపద విశ్వాసాల ప్రకారం గతంలో ఉన్న జంతుబలి సంప్రదాయాలకు ప్రత్యామ్నాయంగా కొబ్బరికాయ సమర్పించే ఆచారం వచ్చిందని చెబుతారు. కొబ్బరికాయపై ఉండే గట్టి పొరను మనిషి శరీరానికి ప్రతీకగా భావిస్తారు. దాన్ని పగలగొట్టడం ద్వారా హింసకు తావులేని రీతిలో దేవుడికి సమర్పణ చేసినట్లు భావిస్తారు. అయితే దీనికి చారిత్రక నిర్ధారణ లేదు. అందువల్ల దీన్ని ఒక సంప్రదాయ వివరణగా చూడాలి.

**అహంకారాన్ని వదిలేయాలనే భావన..**

కొబ్బరికాయ గట్టి పైపొర మనిషిలోని అహంకారం, మొండితనానికి ప్రతీకగా భావిస్తారు. లోపల ఉండే తెల్లని కొబ్బరి గుజ్జును స్వచ్ఛమైన మనసుకు ప్రతీకగా చెబుతారు. కొబ్బరికాయను పగలగొట్టడం అంటే మనలోని అహంకారాన్ని పక్కనపెట్టి దైవానికి శరణాగతి చేయడమనే ఆధ్యాత్మిక భావన ఉంది.

**ఆధ్యాత్మికతతో పాటు ఆరోగ్య ప్రయోజనాలు..**

కొబ్బరికాయకు ఆధ్యాత్మిక ప్రాధాన్యంతో పాటు ఆహార పరంగానూ విలువ ఉంది. కొబ్బరి నీరు శరీరానికి కావాల్సిన ఎలక్ట్రోలైట్స్‌ను అందిస్తుంది. కొబ్బరిలో ఆరోగ్యకరమైన కొవ్వులు, పలు ఖనిజాలు ఉంటాయి. ప్రాంతాన్ని బట్టి కొబ్బరికాయ కొట్టడంపై కొన్ని ప్రత్యేక సంప్రదాయాలు కూడా ఉన్నాయి. ముఖ్యంగా మహిళలు కొబ్బరికాయ కొట్టకూడదనే ఆచారం కొన్ని ప్రాంతాల్లో కనిపిస్తుంది. అయితే ఇది అన్ని ప్రాంతాల్లో ఒకే విధంగా ఉండదు. కొబ్బరికాయను పూజలో సమర్పించడం వెనుక శుభారంభం, పవిత్రత, దైవ ఆశీస్సులు, అహంకారాన్ని విడిచిపెట్టడం వంటి అనేక భావనలు ఉన్నాయి. అందుకే తరతరాలుగా ఈ ఆచారం కొనసాగుతోంది.

# మనిషితో రోబో ఫైట్.. టెర్మినేటర్‌ను తలపించిన వీడియో వైరల్!

-అమెరికాలో మనిషి-రోబో ఫైట్

రోబోతో పోరాడిన ఫ్రాంకీ లాపెన్నా

-ఆరు అడుగుల రోబో పంచ్‌లు, కిక్స్

కిక్స్‌తో వెనక్కి వెళ్లిన లాపెన్నా

-రోబోతో క్రీడలపై మొదలైన చర్చ

మనిషితో ఆరు అడుగుల రోబో ఫైట్ చేస్తే ఎలా ఉంటుంది? హాలీవుడ్ సినిమాలో చూసే సీన్‌లా అనిపించినా.. అమెరికాలో నిజంగానే అలాంటి పోరాటం జరిగింది. శాన్‌ఫ్రాన్సిస్కోలో జరిగిన ఈ ఫైట్‌లో ఇన్‌ఫ్లుయెన్సర్, కంటెంట్ క్రియేటర్ ఫ్రాంకీ లాపెన్నా ఓ హ్యూమనాయిడ్ రోబోతో తలపడ్డారు. ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. అమెరికాకు చెందిన రోబోటిక్స్ కంపెనీ ఆర్‌ఈకే ఈ మ్యాచ్‌ను నిర్వహించింది. మనుషులు రిమోట్ కంట్రోల్‌తో హ్యూమనాయిడ్



రోబోలను నడిపిస్తూ పోటీ పడే వర్చువల్ రియాలిటీ కంబాట్ గేమ్‌పై కంపెనీ పనిచేస్తోంది. అందులో భాగంగానే ఈ ఫైట్‌ను నిర్వహించింది. మ్యాచ్‌కు ముందు రోబో రింగ్‌లో తిరుగుతూ వార్మప్ చేసింది. ఫైట్ మొదలైన తర్వాత లాపెన్నా దానిపై పలుసార్లు పంచ్‌లు విసిరాడు. రోబో కూడా పంచ్‌లు, బలమైన కిక్స్‌తో స్పందించింది. కొన్ని సందర్భాల్లో రోబో కిక్స్ బలంగా తగలడంతో లాపెన్నా రింగ్‌లో వెల్లకిలాపడ్డాడు. ఈ పోరును ఆర్‌ఈకే తమ తొలి 'హ్యూమన్ వర్సెస్ హ్యూమనాయిడ్ రోబో ఫైట్'గా పేర్కొంది. 'హ్యూమన్ వర్సెస్ టెర్మినేటర్' అంటూ వీడియోను సోషల్ మీడియాలో షేర్ చేసింది. ఈ మ్యాచ్‌కు సంబంధించిన మరిన్ని వీడియోలను విడుదల చేస్తామని తెలిపింది. వీడియో వైరల్ కావడంతో నెటిజన్లు కూడా ఆసక్తికరంగా స్పందిస్తున్నారు. భవిష్యత్తులో మనుషులు, రోబోలు ప్రొఫెషనల్ కంబాట్ స్పోర్ట్స్‌లో పోటీ పడతారా? అంటూ చర్చిస్తున్నారు. హ్యూమనాయిడ్ రోబో ప్రవర్తనకు 'టెర్మినేటర్'తో పోలిక రావడం ఇదే తొలిసారి కాదు. గతంలో ఓ ఎలక్ట్రానిక్స్ స్టోర్‌లో కస్టమర్ రోబోను నెట్టగా.. అది అతడి వైపు కదిలి కిక్ చేసేందుకు ప్రయత్నించినట్లు కనిపించిన వీడియో కూడా వైరల్ అయింది. సిబ్బంది వెంటనే రోబోను ఆపేశారు.

# రెచ్చిపోవద్దు.. లోపల దాచుకోవద్దు.. కోపాన్ని హ్యాండిల్ చేయడానికి 5 చిట్కాలు!

కోపం వెనుక అసలు కారణాన్ని గుర్తించాలంటున్న నిపుణులు

కోపం వచ్చిందని మిమ్మల్ని మీరు నిందించుకోవద్దని సూచన

కోపంలో పెద్ద నిర్ణయాలు తీసుకోవద్దని హితవు

ఏ విషయం బాధించిందో స్పష్టంగా చెప్పాలని హితవు

అవసరమైతే మీ హద్దులను స్పష్టంగా నిర్ణయించండని సూచన



ఒక్క క్షణంలో మన మాటలను, మన నిర్ణయాలను మార్చేయగల భావోద్వేగం కోపం. ఎవరైనా మన హద్దులు దాటితే, మనల్ని బాధపెడితే కోపం రావడం సహజం. కానీ దాన్ని వెంటనే బయటకు వెళ్లగక్కడం ఒక సమస్య అయితే.. ఏమీ జరగనట్టు లోపలే దాచుకోవడం మరో సమస్య. కొద్దిసేపటికి కోపం తగ్గిపోయినా.. జరిగిన సంఘటన మాత్రం గంటల తరబడి మనసులో తిరుగుతూనే ఉంటుంది. మరి కోపాన్ని అణుచుకోకుండా, అదుపు తప్పకుండా ఎలా ఎదుర్కోవాలో చూద్దాం..!

**అసలు కోపం ఎందుకొచ్చింది?**

కోపానికి కనిపించే కారణమే అసలు విషయం కాకపోవచ్చు. స్నేహితుడు చివరి నిమిషంలో ప్లాన్ రద్దు చేశాడనుకోండి. దానిపై కోపం రావచ్చు. కానీ దాని వెనుక 'నన్ను పట్టించుకోవడం లేదు' అన్న బాధ ఉండొచ్చు. చిన్న గొడవ కూడా రోజులుగా పేరుకుపోయిన అసంతృప్తిని బయటకు తీసుకురావచ్చు. అందుకే స్పందించే ముందు.. అసలు ఏ విషయం బాధించిందో ఆలోచించండి.

**మిమ్మల్ని మీరు తప్పుపట్టుకోవద్దు**

'నాకు కోపం ఎందుకు వచ్చింది?' అని మిమ్మల్ని మీరు నిందించుకోవాల్సిన అవసరం లేదు. కోపం రావడం మిమ్మల్ని చెడ్డ వ్యక్తిగా మార్చదు. ఆ భావనను నిజాయితీగా గుర్తించడం ముఖ్యం. 'నాకు ఈ విషయం మీద కోపంగా ఉంది' అని అంగీకరించడం.. సమస్యను అర్థం చేసుకునే మొదటి అడుగు.

**ఆ క్షణంలో పెద్ద నిర్ణయాలు వద్దు**

కోపంలో పంపిన మెసేజ్ తర్వాత బాధపడే పరిస్థితి రావచ్చు. అదే సమయంలో సంబంధాన్ని తెంచుకోవడం, కఠినమైన మాటలు చెప్పడం వంటి నిర్ణయాలు మరింత సమస్యకు దారితీయొచ్చు. అందుకే కాసేపు ఆగండి. మెసేజ్ రాయాలనిపిస్తే రాయండి.. కానీ వెంటనే పంపకండి. కాసేపు నడవండి. ఒంటరిగా ఉండండి. మనసు కుదుటపడిన తర్వాతే మాట్లాడండి.

**ఏది హద్దు దాటిందో స్పష్టంగా చెప్పండి**

'నువ్వు ఎప్పుడూ నన్ను గౌరవించవు' అని చెప్పడం కంటే.. అసలు ఏం బాధించిందో చెప్పడం మంచిది. వ్యక్తిగత విషయాన్ని ఇతరులతో పంచుకున్నారా? పదేపదే ఇచ్చిన మాట తప్పారా? మీకు ముఖ్యమైన విషయాన్ని తేలిగ్గా తీసుకున్నారా? అసలు సమస్య ఏదో స్పష్టంగా చెబితే అవతలి వ్యక్తికి కూడా అర్థమవుతుంది. అవసరమైతే మీ హద్దులను కూడా స్పష్టంగా చెప్పొచ్చు.

**ప్రతిదీ మనసులో పెట్టుకోవాల్సిన అవసరం లేదు**

ప్రతి సమస్యకు క్షమాపణ రావాల్సిందేనని ఎదురు చూస్తే మనసు అదే సంఘటన చుట్టూ తిరుగుతూనే ఉంటుంది. అవతలి వ్యక్తి తన తప్పును ఎప్పటికీ అంగీకరించక పోవచ్చు. దాన్ని అంగీకరించడం అంటే వారి ప్రవర్తనను సమర్థించడం కాదు. ఆ సంఘటన ఇకపై మీ సమయాన్ని, ప్రశాంతతను దోచుకోనివ్వకపోవడమే. కొన్ని సందర్భాల్లో చివరి మాట మనదిగా ఉండటం కంటే.. ఆ మాట చెప్పాల్సిన అవసరం లేకపోవడమే నిజమైన ప్రశాంతత.

# 40,000 ఏళ్లుగా భూమిపై ఒంటరిగా ఆధునిక మానవుడు..

మరి మనతో పాటు నివసించిన మిగతా మానవ జాతులు ఏమయ్యాయి? - గత 40వేల ఏళ్లుగా భూమిపై ఉన్న ఏకైక మానవ జాతి 'హోమో సేపియన్స్'

ఒకప్పుడు భూమిపై 16 రకాల మానవ జాతులు నివసించేవని శాస్త్రవేత్తల అంచనా

మన పూర్వీకులు నియాండర్తల్స్, డెనిసోవాన్స్‌తో కలిసి జీవించి సంతానాన్ని కన్న వైనం

ఆఫ్రికాయేతర ప్రజల డీఎన్ఏలో ఇప్పటికీ నియాండర్తల్స్ ఆనవాళ్లు - ఇతర మానవ జాతులన్నీ ఎందుకు అంతరించిపోయాయో ఇప్పటికీ మిస్టరీనే




గడిచిన 40,000 సంవత్సరాలుగా ఈ భూగోళంపై ఆధునిక మానవులమైన మనం (హోమో సేపియన్స్) మాత్రమే ఏకైక మానవ జాతిగా నివసిస్తున్నాం. అయితే, అంతకుముందు మన కథ వేరుగా ఉండేది. మన కుటుంబ వృక్షంలో అనేక ఇతర మానవ జాతులు కూడా భాగంగా ఉండేవి. శాస్త్రవేత్తల పరిశోధనల ప్రకారం.. సుమారు 28 లక్షల సంవత్సరాల క్రితం ప్రారంభమైన 'హోమో' ప్రజాతిలో కనీసం 16 వేర్వేరు జాతులు ఉండేవని అంచనా. కొత్త శిలాజాలు దొరికినప్పుడల్లా ఈ సంఖ్యపై చర్చ జరుగుతూనే ఉంది.

**మన పూర్వీకులు ఎందరో..**

మానవ పరిణామ క్రమంలో ఎన్నో జాతులు కీలక పాత్ర పోషించాయి. వాటిలో కొన్ని ముఖ్యమైనవి:

**హోమో హ్యాబిలిస్:** సుమారు 24 లక్షల సంవత్సరాల క్రితం జీవించిన ఈ జాతి, మొట్టమొదటి రాతి పనిముట్లను ఉపయోగించినట్లు భావిస్తారు.

**హోమో ఎరెక్టస్:** దాదాపు 20 లక్షల సంవత్సరాల క్రితం ఈ జాతి మానవ చరిత్రలోనే అత్యంత విజయవంతమైన వాటిలో ఒకటి. ఆఫ్రికా నుంచి ఆసియా, యూరప్ ఖండాలకు విస్తరించి, పది లక్షల సంవత్సరాలకు పైగా మనుగడ సాగించింది.

**హోమో హైడెల్బర్గెన్సిస్:** ఐదు లక్షల సంవత్సరాల క్రితం జీవించిన ఈ జాతి నుంచే తర్వాతి కాలంలో నియాండర్తల్స్, హోమో సేపియన్స్ వంటి విభిన్న జాతులు ఉద్భవించాయని శాస్త్రవేత్తలు నమ్ముతారు.

**మనతో కలిసి జీవించిన బంధువులు**

ఆధునిక మానవులకు అత్యంత సమీప బంధువులైన నియాండర్తల్స్ (హోమో నియాండర్తలెన్సిస్) యూరప్, పశ్చిమ ఆసియా ప్రాంతాల్లో నివసించారు. వేల సంవత్సరాల పాటు వారు మన పూర్వీకులతో కలిసి జీవించారు. ఈ రెండు జాతుల మధ్య సంకరం కూడా జరిగింది. దీనికి నిదర్శనంగా నేటి ఆధునిక మానవులలో ఆఫ్రికాయేతర సంతతికి చెందిన వారిలో స్వల్ప శాతం నియాండర్తల్ డీఎన్ఏ ఇప్పటికీ కనిపిస్తుంది.

అలాగే, డెనిసోవాన్స్ అనే మరో మానవ జాతి కూడా మన పూర్వీకులతో కలిసి జీవించి, సంతానాన్ని కన్నది. వీరి గురించి పరిమిత శిలాజాలు, జన్యు పదార్థం ద్వారానే తెలిసినప్పటికీ, ఓషియానియా ప్రాంతంలోని ప్రజల డీఎన్ఏలో వీరి ఆనవాళ్లు స్పష్టంగా ఉన్నాయి.

**చివరికి ఒక్కరే మిగిలారు**

సుమారు 40,000 సంవత్సరాల క్రితం నాటికి, హోమో సేపియన్స్ మినహా మిగిలిన మానవ జాతులన్నీ పూర్తిగా అంతరించిపోయాయి. భూమిపై ఏకైక మానవ జాతిగా మనం మాత్రమే మిగిలాం. వాతావరణ మార్పులు, ఆహారం కోసం పోటీ, లేదా హోమో సేపియన్స్‌తో జరిగిన సంఘర్షణ వంటి అనేక కారణాలను శాస్త్రవేత్తలు అంచనా వేస్తున్నా, వారి విలుప్తతకు కచ్చితమైన కారణాలు ఇప్పటికీ ఒక రహస్యంగానే ఉన్నాయి. దీనిపై పరిశోధనలు ఇంకా కొనసాగుతున్నాయి.

# జపాన్‌తో తొలి టీ20.. ఇది థ్రిల్లింగ్ ఛాలెంజ్: శ్రేయస్ అయ్యర్

జపాన్‌తో తొలి టీ20 ఆడేందుకు సిద్ధమైన భారత జట్టు

ఇదొక థ్రిల్లింగ్ ఛాలెంజ్ అన్న కెప్టెన్ శ్రేయస్ అయ్యర్

ప్రత్యర్థి ఆటగాళ్లపై వీడియో క్లిప్పులు చూసి అధ్యయనం చేస్తున్న టీమిండియా

జపాన్ సంస్కృతి, ఆతిథ్యం అద్భుతంగా ఉన్నాయంటూ ప్రశంసలు



అంతర్జాతీయ క్రికెట్‌లో ఒక కొత్త అధ్యాయానికి టీమిండియా శ్రీకారం చుట్టనుంది. చరిత్రలో తొలి సారిగా జపాన్‌తో అంతర్జాతీయ టీ20 మ్యాచ్ ఆడేందుకు భారత జట్టు సిద్ధమైంది. అయితే, ఈరోజు సానో ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియంలో జరగాల్సిన భారత జట్టు ప్రాక్టీస్ సెషన్ భారీ వర్షం కారణంగా రద్దయింది. అయినప్పటికీ, కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ మాత్రం పూర్తి ఉత్సాహంతో ఉన్నాడు. తెలియని ప్రత్యర్థితో వారి గడ్డపై ఆడటం ఒక 'థ్రిల్లింగ్ ఛాలెంజ్' అని అతను అభివర్ణించాడు. అంతకుముందు జరిగిన ప్రెస్ కాన్ఫరెన్స్‌లో శ్రేయస్ అయ్యర్ మాట్లాడుతూ.. "తొలిసారిగా జపాన్‌తో ఆడుతున్నాం. ఇది మాకు ఎంతో థ్రిల్లింగ్‌గా, ఉత్సాహంగా ఉంది. ఇక్కడి పరిస్థితులు, వికెట్ గురించి మాకు పెద్దగా అవగాహన లేదు. అయినా ఒక మంచి మ్యాచ్ ఆడాలని ఎదురు చూస్తున్నాం" అని తెలిపాడు.

**వీడియో క్లిప్పులతో ప్రత్యర్థిపై అధ్యయనం**

జపాన్ జట్టుతో ఇంతకుముందెన్నడూ తలపడనందున, వారి ఆటగాళ్ల బలాబలాలను అంచనా వేయడానికి భారత టీమ్ మేనేజ్‌మెంట్ టెక్నాలజీని ఆశ్రయిస్తోంది. ప్రత్యర్థి ఆటగాళ్లకు సంబంధించిన వీడియో ఫుటేజ్, డిజిటల్ క్లిప్పులను నిశితంగా పరిశీలిస్తోంది. "నేను వారికి సంబంధించిన కొన్ని రీల్స్ చూశాను. మేము వారి ఆటగాళ్ల గురించి పూర్తి స్థాయిలో అధ్యయనం చేసి బరిలోకి దిగుతాం. రేపటి మ్యాచ్‌కు వర్షం అడ్డుపడదని, అభిమానులందరూ ఒక మంచి పోటీని చూస్తారని ఆశిస్తున్నా" అని అయ్యర్ పేర్కొన్నాడు.

**జపాన్ సంస్కృతి, ఆతిథ్యానికి ఫిదా**

పాతతరం క్రికెట్ దేశాలకు భిన్నంగా జపాన్‌లో పర్యటించడం ఒక కొత్త అనుభూతినిస్తోందని అయ్యర్ చెప్పాడు. "ఆస్ట్రేలియా, ఇంగ్లండ్, న్యూజిలాండ్ వంటి పర్యటనలకు ఇది పూర్తిగా భిన్నమైనది. జపాన్ రావడం ఇదే తొలిసారి. ఇక్కడి ప్రజలు, సంస్కృతి, క్రమశిక్షణ అన్నీ కొత్తగా ఉన్నాయి. కొత్త సంస్కృతులను ఇష్టపడే నాకు ఇది బాగా నచ్చింది. భారత్, జపాన్ మధ్య స్నేహబంధం బలపడుతోంది. నాకు 'అరిగాటో', 'కొనిచివా' అనే రెండు జపనీస్ పదాలు తెలుసు" అంటూ నవ్వేశాడు. జపాన్‌లో అడుగుపెట్టినప్పటి నుంచి ప్రజలు ఎంతో ఆప్యాయంగా, సహాయం చేసే గుణంతో ఉన్నారని, వారి ఆతిథ్యం అద్భుతంగా ఉందని ప్రశంసించాడు.

**క్రికెట్ ప్రపంచవ్యాప్తంగా విస్తరిస్తోంది**

క్రికెట్ ఆడని దేశాలు కూడా ఇప్పుడు ఈ ఆటను వేగంగా అందిపుచ్చుకుంటున్నాయని అయ్యర్ వ్యాఖ్యానించాడు. "నేను దీని గురించి ఎప్పుడూ ఆలోచించలేదు. కానీ ఇప్పుడు క్రికెట్ ప్రతి దేశంలోనూ ప్రాచుర్యం పొందుతోంది. అన్ని జట్లు తమదైన శైలిలో రాణిస్తున్నాయి. జపాన్‌తో మ్యాచ్ కూడా ఆసక్తికరంగా ఉంటుందని నేను నమ్ముతున్నా" అని అన్నాడు.

భారత్‌లో యువతారలు వెలుగులోకి రావడానికి ఐపీఎల్ ఒక గొప్ప వేదిక అని అయ్యర్ అభిప్రాయపడ్డాడు. "మా జట్టులోని యువ ఆటగాడు వైభవ్ సూర్యవంశీ ఐపీఎల్ ద్వారానే వెలుగులోకి వచ్చాడు. ప్రతిభను ప్రదర్శించడానికి ఇది ఒక బలమైన వేదిక. ఐపీఎల్‌లో రాణిస్తే అందరి దృష్టి మీపై ఉంటుంది. తద్వారా భారత జట్టులోకి రావడానికి అవకాశాలు మెరుగవుతాయి" అని వివరించాడు.



## నిలబడే నిద్రించగల సామర్థ్యం ఉన్న జంతువులు, పక్షులు ఏవో తెలుసా?

అప్పుడప్పుడు నిలబడే కునుకు తీసే ఏనుగులు

ప్రమాదం నుంచి తప్పించుకునేందుకు నిలబడే విశ్రాంతి తీసుకునే జిరాఫీలు

కొమ్మను గట్టిగా పట్టుకుని నిద్రించే మైనాలు, పావురాలు

ఒంటికాలిపై నిలబడి నిద్రించగలిగే ఫ్లెమింగోలు

గుర్రాలలో నిలబడి నిద్రించేందుకు ప్రత్యేక వ్యవస్థ

మనుషులకు నిద్ర అంటే హాయిగా మంచంపై పడుకోవడం. కానీ జంతు ప్రపంచంలో నిద్రకు లెక్కలేనన్ని పద్ధతులు ఉన్నాయి. కొన్ని ఏకంగా నిలబడే నిద్రపోతాయి. మరికొన్ని పక్షులు కొమ్మపై కూర్చొనే నిద్రలోకి జారుకుంటాయి. ఇలా నిలబడే స్థితిలోనే విశ్రాంతి తీసుకునే ఏడు జంతువుల గురించి తెలుసుకుందాం..

**ఏనుగులు...**

భారీ శరీరంతో కనిపించే ఏనుగులు అప్పుడప్పుడు నిలబడే చిన్న కునుకు తీస్తాయి. ఇలా చేయడం వల్ల నేలపై పడుకొని మళ్లీ లేవాల్సిన అవసరం ఉండదు. అయితే గాఢమైన నిద్ర కోసం మాత్రం అవి నేలపై పడుకుంటాయి.

**జిరాఫీలు...**

పొడవాటి కాళ్లు, మెడతో ఉండే జిరాఫీలకు నేలపైకి కూర్చొని మళ్లీ లేవడం అంత సులభం కాదు. అందుకే కొన్ని సందర్భాల్లో నిలబడే విశ్రాంతి తీసుకుంటాయి. ప్రమాదం ఎదురైతే వెంటనే కదలడానికి ఇది ఉపయోగపడుతుంది.

**మైనాలు, పావురాలు**

ఈ పక్షుల కాళ్లలో అద్భుతమైన ప్రత్యేకత ఉంది. కొమ్మపై వాలగానే వాటి వేళ్లు కొమ్మను గట్టిగా పట్టుకుంటాయి. దీంతో నిద్రలో ఉన్నా కిందపడిపోవు. ఎత్తులో ఉండటం వల్ల కొన్ని మాంసాహార జంతువుల నుంచి రక్షణ కూడా లభిస్తుంది.

**ఫ్లెమింగోలు ..**

ఒంటికాలిపై నిలబడి నిద్రించే ఫ్లెమింగోలు చూపరులను ఆశ్చర్యపరుస్తాయి. ముఖ్యంగా నీటిలో నిల్చున్నప్పుడు ఒంటికాలిపై ఉండటం వల్ల శరీర ఉష్ణాన్ని కాపాడుకోవడానికి ఉపయోగపడుతుంది. వాటి కాళ్ల నిర్మాణం ఈ భంగిమలో ఎక్కువ శ్రమ లేకుండా నిలబడేలా చేస్తుంది.

**జీబ్రాలు...**

అడవిలో సింహాల వంటి వేటాడే జంతువుల నుంచి ఎప్పుడూ ప్రమాదం ఉంటుంది. అందుకే జీబ్రాలు నిలబడే విశ్రాంతి తీసుకుంటాయి. దీనివల్ల ప్రమాదం కనిపించిన వెంటనే పరుగెత్తేందుకు వీలుగా ఉంటుంది. వాటి కాళ్ల ప్రత్యేక నిర్మాణం శరీరాన్ని ఎక్కువ కండరాల శ్రమ లేకుండా మోయగలదు.

**ఆవులు ...**

ఆవులు కూడా నిలబడే విశ్రాంతి తీసుకోగలవు. ముఖ్యంగా బయట ఉన్నప్పుడు పరిసరాలను గమనిస్తూ కొంతసేపు అలా ఉండిపోతాయి. అయితే ఎక్కువసేపు నిద్రించడానికి నేలపై పడుకుంటాయి.

**గుర్రాలు ...**

నిలబడే నిద్రకు గుర్రాలు ప్రసిద్ధి. వాటి కాళ్లలో ఉండే 'స్టే అపరేటస్' వ్యవస్థ కీళ్లను స్థిరంగా ఉంచుతుంది. దీంతో ఎక్కువ కండరాల శక్తి అవసరం లేకుండానే నిలబడగలవు. అడవిలో ప్రమాదం ఎదురైతే వెంటనే పరుగెత్తేందుకు ఈ సామర్థ్యం ఎంతో ఉపయోగపడుతుంది.

## విఘ్నేశ్వరుని పూజల్లో టిడిపి కూటమి నాయకులు

సిఎస్‌పురం, సింధూరదర్శిని: మండలకేంద్రమైన సిఎస్‌పురం పట్టణంలో ఏర్పాటు చేసిన వినాయక మండపాల వద్ద విఘ్నేశ్వరుని పూజల్లో మండల నాయకులు పలువురు పాల్గొని పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీక రించారు. ఈసందర్భంగా పట్టణంలోని మండల కార్యాలయాల సమీపంలో ఏనిగడ్డ వీధి,శివాలయం రహదారి వద్ద ఏర్పాటు చేసిన గణేష్ విగ్రహాల వద్ద మహా అన్నప్రసాద వితరణ చేశారు. ఈసందర్భంగా మండల కార్యాలయం,ఏనిగడ్డ గణేష్ విగ్రహాల వద్ద ప్రభుత్వ కనీసవేతనాల సలహామండలి సభ్యులు డాక్టర్ బొమ్మనబోయిన వెంగయ్య, ఒంగోలు పార్లమెంట్ టిడిపి కార్యనిర్వాహక కార్యదర్శి యన్.సి.మాలకొండయ్య, మండల సొసైటీ చైర్మన్ చెరుకుపల్లె వెంకటరెడ్డి, పలువురు టిడిపి జనసేన బిజెపి నాయకులు పాల్గొని గణేష్ విగ్రహాలకు పూజలుచేసి అన్నప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయా గణేష్ మండపాల నిర్వాహకులు ఉత్సవ కమిటీ ప్రతినిధులు స్థానికులు, నాయకులకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు స్థానికులు పాల్గొన్నారు.

# పోషకాలు పూర్తిగా అందాలంటే పండ్లు ఎప్పుడు తినాలి?

భోజనానికి ముందు పండ్లు తినడం మంచిదంటున్న నిపుణులు

భోజనానికి 30 నిమిషాల ముందు పండ్లు తింటే కడుపు నిండిన భావన

హెవీగా తిన్న వెంటనే పండ్లు తింటే ఉబ్బరం రావొచ్చని హెచ్చరిక

మధుమేహం ఉన్నవారు ప్రొటీన్ లేదా ఆరోగ్యకరమైన కొవ్వులతో కలిపి తీసుకోవాలంటున్న నిపుణులు

భోజనాలకు మధ్యలో పండ్లను స్నాక్‌గానూ తీసుకోవచ్చని సూచన

పండ్లు తినడం ఆరోగ్యానికి ఎంతో మేలు. విటమిన్లు, ఖనిజాలు, పీచు పుష్కలంగా లభిస్తాయి. అయితే భోజనానికి ముందు తినాలా? తర్వాత తినాలా? అన్న సందేహం చాలామందిలో ఉంటుంది. పండ్లను సరైన సమయంలో తీసుకుంటే పోషకాలు అందడంతో పాటు జీర్ణక్రియ కూడా సాఫీగా సాగుతుందని నిపుణులు చెబుతున్నారు.

**భోజనానికి ముందే..**

పండ్లలో సహజ చక్కెరలు, కరిగే పీచు ఎక్కువగా ఉంటాయి. ఇవి ప్రొటీన్లు, కొవ్వులతో పోలిస్తే త్వరగా జీర్ణమవుతాయి. అందుకే ఖాళీ కడుపుతో లేదా ప్రధాన భోజనానికి ముందు పండ్లు తీసుకోవడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు. భోజనానికి సుమారు 30 నిమిషాల ముందు పండ్లు తింటే కడుపు నిండిన భావన కలుగుతుంది. దీంతో భోజనంలో అతిగా తినకుండా ఉండొచ్చు.

**భోజనం తర్వాత తింటే?**



బిర్యానీ, మాంసాహారం వంటి భోజనం చేసిన వెంటనే పండ్లు తింటే జీర్ణక్రియ కొంత ఆలస్యం కావచ్చు. కొందరిలో ఉబ్బరం, గ్యాస్ వంటి ఇబ్బందులు కనిపించే అవకాశం ఉంది. అయితే పండ్లు కడుపులో కుళ్లిపోతాయన్న ప్రచారంలో నిజం లేదని వైద్య నిపుణులు చెబుతున్నారు. కడుపులో ఉండే ఆమ్లాలు హానికర బ్యాక్టీరియాను నియంత్రిస్తాయి.

**మధుమేహం ఉన్నవారు ఇలా..**

మధుమేహం ఉన్నవారు కేవలం పండ్లను కాకుండా ప్రొటీన్, ఆరోగ్యకర కొవ్వులు లేదా సంక్లిష్ట కార్బోహైడ్రేట్లు ఉన్న ఆహారంతో కలిపి తీసుకోవచ్చు. ఇలా చేయడం వల్ల పండ్లలోని చక్కెర శరీరంలోకి నెమ్మదిగా చేరుతుంది. రక్తంలో గ్లూకోజ్ ఒక్కసారిగా పెరగకుండా తోడ్పడుతుంది.

**స్నాక్‌గా తీసుకోవచ్చు**

ఉదయం లేదా మధ్యాహ్నం భోజనానికి మధ్య పండ్లను స్నాక్‌గా తీసుకోవడం మంచి అలవాటు. భోజనానికి రెండు గంటల ముందు లేదా రెండు గంటల తర్వాత పండ్లు తినడం కూడా సౌకర్యవంతమైన పద్ధతిగా నిపుణులు సూచిస్తున్నారు. వ్యక్తిగత జీర్ణశక్తి, ఆరోగ్య పరిస్థితిని బట్టి సమయాన్ని మార్చుకోవచ్చు.

# సినిమా న్యూస్

## 'మొద రాత్రి' (నెట్ ఫ్లిక్స్) మూవీ రివ్యూ!



తమిళంలో కామెడీ డ్రామా జోనర్ నుంచి ఒక సినిమా ఓటీటీకి వచ్చింది. రిషికాంత్ – అనిష్మా అనిల్ కుమార్ ప్రధానమైన పాత్రలను పోషించిన ఈ సినిమా పేరే 'మొద రాత్రి'. మైత్రీ మూవీ మేకర్స్ వారు తమిళంలో నిర్మించిన సినిమా ఇది. ఆగస్టు 21వ తేదీన థియేటర్లలో విడుదలైన ఈ సినిమా, ఈ నెల 18వ తేదీ నుంచి 'నెట్ ఫ్లిక్స్'లో స్ట్రీమింగ్ అవుతోంది. తమిళంతో పాటు తెలుగు .. మలయాళ .. కన్నడ .. హిందీ భాషల్లో ఈ సినిమా అందుబాటులో ఉంది.

మారుతి ( రిషికాంత్) దుబాయ్ లో జాబ్ చేస్తూ ఉంటాడు. అతనికి తన ఊరుకు రావడంగానీ .. పెళ్లి చేసుకోవడం గాని ఎంతమాత్రం ఇష్టం ఉండదు. దుబాయ్ నుంచి అతను పంపిస్తున్న డబ్బులతో ఇక్కడి కుటుంబ సభ్యుల అవసరాలు తీరుతుంటాయి. అతనికి ఒక చెల్లి .. బావ ఉంటారు. మారుతి కుటుంబ సభ్యులంతా కలిసి అతనికి ఒక సంబంధం చూస్తారు. బుజ్జి లక్ష్మి ( అనిష్మా)తో పెళ్లి ఖాయం చేస్తారు. మారుతికి ఒక్క మాటకూడా చెప్పకుండా పెళ్లిరోజు నాటికి అతను దుబాయ్ నుంచి వచ్చేలా చేస్తారు.

బుజ్జి లక్ష్మి తండ్రిలేని పిల్ల. ఆమె ఒక యువకుడిని ప్రేమిస్తుంది. ఈ విషయం తెలిసే తల్లి ఆమెకి మారుతి సంబంధం చూస్తుంది. పెళ్లి సమయానికి తాను ప్రేమించిన యువకుడితో లేచిపోవడానికి బుజ్జి లక్ష్మి ప్లాన్ చేస్తుంది. దుబాయ్ నుంచి వచ్చిన మారుతికి తన పెళ్లి విషయం అప్పుడే తెలుస్తుంది. తల్లి మాట కాదనలేక ఆ పెళ్లికి ఒప్పుకుంటాడు. పెళ్లి తరువాత శోభనానికి కూడా ఏర్పాట్లు జరుగుతూ ఉంటాయి. అందుకు అవసరమైన మంచాన్ని ప్రత్యేకంగా చేయించి తెప్పిస్తూ ఉంటారు.

ముహూర్తానికి సమయం దగ్గర పడుతుంది. బుజ్జి లక్ష్మిని ప్రేమించిన యువకుడు సమయానికి ఆ ఊరు చేరుకోలేకపోతాడు. దాంతో మారుతితో ఆమె పెళ్లి జరిగిపోతుంది. ఫస్టు నైట్ కి ఏర్పాట్లు జరుగుతూ ఉంటాయి. అయినా తాను ప్రేమించిన యువకుడు రాగానే, అతనితో కలిసి అక్కడి నుంచి పారిపోవాలనే ఆలోచనలో బుజ్జి లక్ష్మి ఉంటుంది. ఆ ప్రయత్నంలో ఆమె మారుతికి దొరికిపోతుంది. అప్పుడు అతను ఏం చేస్తాడు? ఆ సంఘటనతో ఆమె జీవితం ఎలాంటి మలుపు తిరుగుతుంది? తాను ఇష్టపడిన యువకుడితో ఆమె ప్రయాణం సాగుతుందా? పెళ్లంటే మారుతికి ఎందుకు ఇష్టం లేదు? అనేది మిగతా కథ.

పెళ్లి అంటే ఇష్టం లేని మారుతి తల్లిమాట కాదనలేక పెళ్లి పీటలపైకి వస్తాడు. తాను ప్రేమించిన యువకుడికి దూరం చేసి, మారుతితో తల్లి చేస్తున్న పెళ్లికి అయిష్టంగా తల వంచుతుంది బుజ్జి లక్ష్మి. ఇద్దరికీ ఇది ఎంతమాత్రం ఇష్టం లేని పెళ్లి. అయినా పెద్దల మాట కాదనలేక .. వాళ్ల సంతోషం కోసం ఈ పెళ్లికి అంగీకరిస్తారు. అలాంటి ఈ జంటకి ఎలాంటి అనుభవాలు ఎదురవుతాయి? అనే అంశం చుట్టూ ఈ కథను అల్లుకుంటూ వెళ్లారు.

ఇష్టం లేని పెళ్లికి జరుగుతున్న ఏర్పాట్లు .. దగ్గర పడుతున్న ముహూర్తం సమయం .. లవర్ తో లేచిపోవాలనుకున్న బుజ్జి లక్ష్మీ .. అక్కడికి చేరుకోలేకపోతున్న లవర్ .. తప్పనిసరి పరిస్థితులలో తాళి కట్టించుకున్న బుజ్జి లక్ష్మికి సంబంధించిన సన్నివేశాలు ఫస్టాఫ్ లో ఆడియన్స్ ముందుకు వస్తాయి. తనని పెళ్లి చేసుకోవడం బుజ్జి లక్ష్మికి ఇష్టం లేదని మారుతికి, అతనికి తెలియకుండానే పెళ్లి ఏర్పాట్లు జరిగాయని బుజ్జి లక్ష్మికి తెలియడం వంటి సన్నివేశాలతో సెకండాఫ్ పుంజుకుంటుంది.

పెళ్లి పీటలపై నుంచి పెళ్లి కూతురు తన లవర్ తో పారిపోవడం వంటి కథలతో చాలానే సినిమాలు వచ్చాయి. అయితే అలా పారిపోవడానికి ముందుగా వేసుకున్న ప్లాన్ ఫెయిల్ కావడంతో పెళ్లి జరిగిపోవడం .. ఆ తరువాత ఫస్టు నైట్ రోజున పారిపోవడానికి ప్రయత్నించి భర్తకి దొరికిపోయినప్పుడు ఎలా ఉంటుంది? అనేది ఈ కథలోని కొత్త పాయింట్ గా చెప్పుకోవచ్చు. ఇక్కడి నుంచి కథ ఎలాంటి మలుపులు తీసుకోనుందా అనే ఒక ఆసక్తి ఆడియన్స్ లో పెరుగుతుంది.

పెళ్లికి వచ్చిన బంధువులు అంతా బాగుంటే అక్షతలు వేసి వెళతారు. ఏ మాత్రం తేడా కొట్టినా గుసగుసలతో మానసిక ఆనందాన్ని పొందుతారు. ఇక కొంతమంది మగాళ్లు తాగేసి నానా గందరగోళాన్ని సృష్టిస్తారు. ఈ తరహా సన్నివేశాలను దర్శకుడు సహజత్వానికి దగ్గరగా ఆవిష్కరించాడు. ఈ తరహా కంటెంట్ కి కామెడీ ప్రధానమైన బలమై నిలుస్తుంది. ఆ స్థాయి కామెడీని మాత్రం ఈ కథలో కలపలేకపోయారు.

ఇక ఈ కథలో పాత్రలు చాలా ఎక్కువైపోయాయి. అందువలన కొన్ని పాత్రలకి సంబంధించిన వరసలు, ఒక్కసారి చూడటం వలన రిజిస్టర్ కావు. హీరోకి ఒక ఫ్లాష్ బ్యాక్ ఉంటుందిగానీ, అది అంతగా ప్రభావితం చేయలేదు. ఇక ఫస్టు నైట్ కి సంబంధించిన కొత్త మంచం చుట్టూ కూడా కామెడీని వర్కౌ చేయడానికి ప్రయత్నించినట్టుగా కనిపించదు. లవ్ .. ఎమోషన్ .. కామెడీలో ఆశించిన స్థాయి గాఢత కనిపించదు.

అంతగా అవసరం లేని ఒకటి రెండు సన్నివేశాలు కూడా కనిపిస్తాయి. దర్శకుడికి ఇది ఫస్టు మూవీ కావడం కూడా అందుకు ఒక కారణమై ఉండొచ్చు. ఆర్టిస్టులు అందరూ బాగా చేశారు. సురేంద్రన్ ఫొటోగ్రఫీ .. భరత్ శంకర్ నేపథ్య సంగీతం .. అశోక్ అర్జునన్ ఎడిటింగ్ ఫరవాలేదు.

యువత ప్రేమకి .. ఆకర్షణకి మధ్య గల తేడాను అర్థం చేసుకోవాలి. ప్రేమించిన యువకుడితో వెళ్లిపోవడం కాదు, తనని పోషించే సమర్థత .. బాధ్యత అతనికి ఉన్నాయా లేదా అనేది అమ్మాయిలు ఆలోచన చేయాలి. అమ్మాయిలు ప్రేమించినవారితో కాదు .. ప్రేమ పట్ల నమ్మకం .. ప్రేమపై సరైన అభిప్రాయం ఉన్నవారితో కలిసి అడుగుముందుకు వేయాలి అనే ఒక సందేశం ఈ సినిమాలో కనిపిస్తుంది.టైటిల్ 'మొద రాత్రి' అయినప్పటికీ, ఫ్యామిలీతో కలిసి చూడొచ్చు.

సినిమా వివరాలు

సినిమా పేరు: మోద రాత్రి

జానర్: కామెడీ, డ్రామా

విడుదల తేదీ: 2026-09-21

తారాగణం: రిషికాంత్, అనీష్మా అనిల్‌కుమార్, షెల్లీ కిషోర్, చేతన్, భగవతి పెరుమాళ్

దర్శకుడు: రాజా కరుప్పసామి

సంగీతం: భరత్ శంకర్

బ్యానర్: మైత్రీ మూవీ మేకర్స్

సమీక్ష: పెద్దింటి

మోధ రాత్రి రేటింగ్: 5కి 2.25

## వెంకీ 'ఆదర్శ కుటుంబం' నుంచి ఫస్ట్ సింగిల్.. డేట్ ఫిక్స్!

విక్టరీ వెంకటేశ్, త్రివిక్రమ్ కాంబోలో వస్తున్న 'ఆదర్శ కుటుంబం'

సినిమాలోని తొలి పాట 'నారాయణమ్మ' విడుదలకు సిద్ధం – రేపు పాటను విడుదల చేయనున్నట్లు ప్రకటన

ఎస్ఎస్ తమన్ సంగీతం అందించిన ఈ సినిమా అక్టోబర్ 2న రిలీజ్

ఈ చిత్రాన్ని నిర్మిస్తోన్న హారిక అండ్ హాసిని క్రియేషన్స్



విక్టరీ వెంకటేశ్, ప్రముఖ దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబినేషన్‌లో వస్తున్న 'ఆదర్శ కుటుంబం' సినిమా నుంచి మేకర్స్ కీలక అప్‌డేట్ ఇచ్చారు. ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఈ సినిమాలోని మొదటి పాట 'నారాయణమ్మ'ను రేపు(సెప్టెంబర్ 22న) విడుదల చేయనున్నట్లు అధికారికంగా ప్రకటించారు. తమన్ స్వరాలు సమకూరుస్తున్న ఈ చిత్రంలోని 'నారాయణమ్మ' పాటను రామజోగయ్య శాస్త్రి రాశారు. ఇది ఒక మాస్ అండ్ ఎంటర్‌టైనింగ్ సాంగ్‌గా ఉండబోతోందని చిత్రబృందం తెలిపింది. ఆదిత్య మ్యూజిక్ ద్వారా ఈ పాట ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌పై వెంకటేశ్ అభిమానుల్లో, సాధారణ ప్రేక్షకుల్లో భారీ ఆశలు నెలకొని ఉన్నాయి. హారిక అండ్ హాసిని క్రియేషన్స్ పతాకంపై ఎస్. రాధాకృష్ణ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. వెంకటేశ్ సరసన శ్రీనిధి శెట్టి హీరోయిన్‌గా నటిస్తున్న ఈ సినిమాలో మరో ఇద్దరు భామలు నివేదా పేతురాజ్, డింపుల్ హయాతి ప్రత్యేక పాత్రల్లో అలరించనున్నారు. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసి, 'ఆదర్శ కుటుంబం' చిత్రాన్ని అక్టోబర్ 2న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

## అప్పుడు ఐదేళ్లు.. ఇప్పుడంత గ్యాప్ వద్దు బుచ్చి!

ఒక సినిమా హిట్ అయితే దర్శకుడి దగ్గర కథలతో పాటు అవకాశాలు కూడా క్యూ కడతాయి. ఇప్పుడు యంగ్ డైరెక్టర్ బుచ్చిబాబు సానా పరిస్థితి కూడా దాదాపు ఇలానే ఉంది. ఉప్పెనతో ఇండస్ట్రీలో తనదైన గుర్తింపు సంపాదించుకున్న ఆయన.. మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ పెద్ది మూవీతో తన ఫ్యాన్ బేస్ ను పెంచుకున్నారు. దీంతో ఇప్పుడు బుచ్చిబాబు తర్వాతి స్టెప్ ఏంటన్నది సోషల్ మీడియాలో హాట్ టాపిక్ గా మారింది. అయితే బుచ్చిబాబు కెరీర్ లో ఇప్పుడు ఒక విషయం మాత్రం ఇంట్రెస్టింగ్ గా మారింది. ఉప్పెన తర్వాత రెండో సినిమా పెద్ది రావడానికి దాదాపు ఐదేళ్లు పట్టింది. 2021లో ఉప్పెన మూవీ రిలీజ్ అవ్వగా, 2026 మార్చిలో పెద్ది మూవీ ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఆ గ్యాప్ లో సినిమా కోసం ఎదురుచూసిన ఫ్యాన్స్ కు ఈసారి అంత సమయం వెయిట్ చేయించకూడదనే ఆలోచనలో దర్శకుడు ఉన్నట్లు టాక్ వినిపిస్తోంది. ప్రస్తుతం బుచ్చిబాబు తన నెక్స్ట్ స్టోరీపై ఫోకస్ పెట్టినట్లు తెలుస్తోంది. ఆయన నెక్స్ట్ హీరో విషయంలో మహేష్ బాబు పేరు మెయిన్ గా వినిపిస్తోంది. ఇద్దరి మధ్య స్టోరీకి సంబంధించిన చర్చలు జరిగినట్లు ఇప్పటికే ప్రచారం ఉంది. అయితే మహేష్ ప్రస్తుతం రాజమౌళి దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'వారణాసితో బిజీగా ఉన్నారు. ఆ సినిమా పనులు పూర్తయ్యే వరకు బుచ్చిబాబు ప్రాజెక్టుపై పూర్తి క్లారిటీ రావడం కాస్త కష్టమే. ఇదే సమయంలో బుచ్చిబాబు మరోసారి ఎక్కువ గ్యాప్ తీసుకోకుండా ఉండేందుకు ముందుగానే స్క్రిప్ట్ ను సిద్ధం చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. మహేష్ బాబుతో కాంబినేషన్ పాజిబుల్ అయితే దానికి తగ్గట్టుగా ముందుకు వెళ్లొచ్చు. ఒకవేళ మరింత సమయం పట్టే పరిస్థితి వస్తే.. మరో క్రేజీ కాంబినేషన్ తో ముందుకు వెళ్లే ఆలోచన కూడా ఉండొచ్చనే టాక్ వినిపిస్తోంది. అయితే ఆ విషయంలో సోషల్ మీడియాలో వస్తున్న ప్రతి ప్రచారాన్ని నమ్మాల్సిన అవసరం లేదు. ముఖ్యంగా చిరంజీవితో బుచ్చిబాబు సినిమా అంటూ వచ్చిన వార్తలు ఫేక్ అని ఇప్పుడు తెలుస్తోంది. కాబట్టి అఫీషియల్ అనౌన్స్మెంట్ వచ్చే వరకు హీరో విషయంలో ఎలాంటి నిర్ణయానికి రావడం తొందరపాటే. ప్రస్తుతం అసలు ఆసక్తి మాత్రం బుచ్చిబాబు ఎప్పుడు ఎవరితో తన నెక్స్ట్ సినిమాను ప్రకటిస్తారన్నదే. పెద్ది తర్వాత వచ్చిన క్రేజ్ ను క్యాష్ చేసుకుంటూ.. ఈసారి స్టోరీని సిద్ధం చేసి త్వరగానే రంగంలోకి దిగాలని చూస్తున్నారనే చర్చ జరుగుతోంది. ఈ ఏడాది చివర్లో లేదా 2027 స్టార్టింగ్ లో తన మూడో సినిమాపై బుచ్చిబాబు క్లారిటీ ఇచ్చే అవకాశం ఉందనే టాక్ కూడా ఉంది. అలా అప్పుడు ఐదేళ్లు పట్టింది.. ఇప్పుడు మాత్రం అంత గ్యాప్ వద్దు బుచ్చి అంటూ ఫ్యాన్స్ కామెంట్స్ చేస్తున్నారు. మరి ఈసారి బుచ్చిబాబు ఎలాంటి సర్ప్రైజ్ ఇస్తారో చూడాలి.



## ప్రారంభమైన 'ది ప్యారడైజ్' జాతర.. రికార్డు స్థాయిలో అడ్వాన్స్ బుకింగ్స్!

నైజాంలో మొదలైన బుకింగ్స్.. కొద్దిసేపట్లోనే కోటి వసూళ్లు

నేడు హైదరాబాద్‌లో ప్రీ రిలీజ్ వేడుక.. సర్‌ప్రైజ్‌కు సిద్ధమైన టీమ్

'దసరా' తర్వాత నాని, శ్రీకాంత్ ఓదెల కలయికలో వస్తున్న రెండో సినిమా

ఈ గురువారం ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్ రిలీజ్

నేచురల్ స్టార్ నాని, దర్శకుడు శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో వస్తున్న 'ది ప్యారడైజ్' చిత్రంపై నెలకొన్న భారీ అంచనాలకు తగ్గట్టే అడ్వాన్స్ బుకింగ్స్‌కు అద్భుతమైన స్పందన లభిస్తోంది. ఈ గురువారం సినిమా విడుదల కానుండగా, నైజాం ప్రాంతంలో ప్రారంభమైన బుకింగ్స్ పోటెత్తాయి. బుకింగ్స్ మొదలైన కొద్ది సమయంలోనే రూ.1 కోటికి పైగా గ్రాస్ వసూలైనట్లు ట్రేడ్ వర్గాలు వెల్లడించాయి. గత రాత్రి డిస్ట్రిక్ట్ యాప్‌లో అడ్వాన్స్ బుకింగ్స్ ప్రారంభించగా, ప్రేక్షకుల నుంచి అనూహ్యమైన స్పందన వచ్చింది. లక్షకు పైగా టికెట్లు అమ్ముడైనట్లు సమాచారం. దీంతో పలు షోలు ఇప్పటికే హౌస్‌ఫుల్ బోర్డులతో నిండిపోవడం సినిమాపై ఉన్న క్రేజ్‌ను స్పష్టం చేస్తోంది. మిగిలిన ప్రాంతాల్లోనూ పూర్తి స్థాయి అడ్వాన్స్ బుకింగ్స్ త్వరలోనే ప్రారంభం కానున్నాయి. ఈ స్థాయిలో స్పందన రావడం చూసి చిత్రబృందం హర్షం వ్యక్తం చేస్తోంది. బ్లాక్‌బస్టర్ చిత్రం 'దసరా' తర్వాత నాని, శ్రీకాంత్ ఓదెల కలయికలో వస్తున్న రెండో సినిమా కావడంతో 'ది ప్యారడైజ్'పై మొదటి నుంచి అంచనాలు ఆకాశాన్నంటాయి. ఈసారి కూడా విభిన్నమైన కథాంశంతో, బలమైన యాక్షన్ ఎలిమెంట్స్‌తో శ్రీకాంత్ ఓదెల ఈ చిత్రాన్ని తెరకెక్కించినట్లు తెలుస్తోంది. నాని గత చిత్రాలకు భిన్నమైన గెటప్‌లో కనిపించనుండటం కూడా అభిమానుల్లో ఆసక్తిని రెట్టింపు చేసింది. ఈ చిత్రంలో నానికి జోడీగా కయాదు లోహర్ నటిస్తుండగా, సీనియర్ నటుడు మోహన్ బాబు ప్రతినాయకుడి పాత్రలో కనిపించనున్నారు. సినిమా ప్రమోషన్లలో భాగంగా ఈరోజు హైదరాబాద్‌లోని శిల్పకళా వేదికలో చిత్ర ప్రీ-రిలీజ్ వేడుకను ఘనంగా నిర్వహించనున్నారు. ఈ ఈవెంట్‌లో అభిమానుల కోసం ఓ ప్రత్యేక సర్‌ప్రైజ్ కూడా ప్లాన్ చేసినట్లు చిత్రబృందం ప్రకటించడంతో ఈ కార్యక్రమంపై కూడా ఆసక్తి పెరిగింది. రాఘవ్ జుయల్, తనికెళ్ల భరణి కీలక పాత్రలు పోషించిన ఈ చిత్రానికి సంగీత సంచలనం అనిరుధ్ రవిచందర్ అందించిన సంగీతం మరో ప్రధాన ఆకర్షణగా నిలవనుంది.

Printed by:KALICHETI VENKAIAH, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Published by:KALICHETI VENKAIAH, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Owned by:KALICHETI VENKAIAH, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Printed at:SINDHURA DARSINI PUBLICATION, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410.
Editor: KALICHETI VENKAIAH, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Email:SINDHURADARSINI.2023@Gmail.com, Cell:7569677170,RNI/APTEL/2023/87662